PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 253 | విజయవాడ, ఆదివారం 16 ఏప్రిల్ 2023 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 16 April 2023 | Rs

సిటీ



ఉప్పెనలా ఉక్కు సంకల్ప పాదయాత్ర

లోపలి పేజీలో..



మళ్లీ మెరిసిన కోహ్లి

- ఢిల్లీపై 23 పరుగుల తేడాతో బెంగళూరు గెలుపు
- క్యాపిటల్స్ ఖాతాలో ఐదో ఓటమి

లోపలి పేజీలో..

పొంచి వున్న ఎల్‌నినో ముప్పు!

న్యూఢిల్లీ : ఈ ఏడాది ఎల్‌నినో ముప్పు పొంచి వుందని వాతావరణ పరిశోధకులు హెచ్చరిస్తు న్నారు. ఈసారి రుతుపవనాలు సమృద్ధిగా వుంటాయని చెప్పలేమని భారత వాతావరణ విభాగం (ఐఎండి), ప్రైవేట్ వాతావరణ అంచనాల సంస్థ స్కైనెట్ పేర్కొన్నాయి. జూన్‌లో ఎల్‌నినో రాగలదని ప్రస్తుతం వేస్తున్న అంచనాలతో ఈసారి వర్షాకాలం సీజను దెబ్బతినేందుకు అవకాశాలు కూడా వున్నాయని భావిస్తున్నారు. "ఈ ఏడాది ఎల్‌నినో భయం వాస్తవం. వర్షాకాలం రెండో అర్ధభాగంలో దీని ప్రభావం వుండగలదని అంచనా." అని స్కైనెట్, ఐఎండి హెచ్చరించాయి. ప్రస్తుతం దీర్ఘకాల సగటు (ఎల్‌పిఎ)లో 94శాతం సాధారణం కంటే తక్కువగా వర్షాలు కురుస్తాయని స్కైనెట్, 96శాతం సాధారణం కంటే తక్కువ వుంటుందని ఐఎండి పేర్కొన్నాయి. వర్షాకాలం సీజన్ అయిన జూన్, జులై, ఆగస్టు మధ్యలో ఎల్‌నినో సంభవించే అవకాశాలు దాదాపు 70శాతం వున్నాయని ఐఎండి పేర్కొంది. ఒకవేళ జూన్‌లో ఎల్‌నినో ఏర్పడకపోతే జులైలో సంభవించడానికి 80శాతం అవకాశాలు వుంటాయని తెలిపింది. జూన్‌లో ఎల్‌నినో ఏర్పడే అవకాశాలు 50శాతం వరకూ వున్నాయని ఐఎండి ఈ వారం ప్రారంభంలో తెలిపింది. ఎల్‌నినో అనేది వర్షాకాలపు పరిస్థితిని గణనీయంగా మార్చగల సత్తా వున్న వైల్డ్ కార్డ్. జూన్‌లోనే ఎల్‌నినో రావడానికి అత్యధిక అవకాశాలు వున్నాయని అమెరికా వాతావరణ సంస్థ తాజాగా పేర్కొంది. ఎల్‌నినో నెలకొనడం వల్ల భారతదేశంలో కరువు ముంచుకురావచ్చు. 2000 సంవత్సరం నుండి ఇప్పటివరకు ఆరు సంవత్సరాలు ఎల్‌నినో ప్రభావం కనబడింది. 2002, 2004, 2009, 2014, 2015, 2018ల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఈ ఆరేళ్లలో ఐదేళ్లు కరువు పరిస్థితులు నెలకొన్నాయి. వాటిల్లో 2002, 2009లలో తీవ్ర దుర్భిక్షం నెలకొంది. ఎల్‌నినో వల్ల కలిగే ఇతర ప్రభావాల్లో దోమల సంబంధిత వ్యాధులు మలేరియా, డెంగీ వంటివి ప్రబలే అవకాశముంది.

జపాన్ ప్రధానిపై బాంబు దాడి

సురక్షితంగా తప్పించుకున్న కిషిదా



శనివారం వకయమాలో ప్రధాని కిషిదాపై పొగబాంబు విసిరిన ఘటనలో ఓ యువకుణ్ణి అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

టోక్యో : జపాన్ ప్రధాని ఫ్యుమియో కిషిదా పాల్గొన్న కార్యక్రమంపై శనివారం బాంబుదాడి జరిగింది. ఈ దాడిలో ఆయన సురక్షితంగా బయటపడ్డారు. పశ్చిమ జపాన్ ఓడరేవు నగరంలో ఒక ప్రచార కార్యక్రమంలో కిషిదా ప్రసంగించడానికి కొద్దిసేపు ముందు ఆ బాంబు పేలింది. 30-40 సెంటీమీటర్ల పొడవైన పైపు బాంబును సభా వేదికవైపు ఓ వ్యక్తి విసిరాడు. ఆ ప్రాంతంలో పేలుడు శబ్దం వినిపించినట్లు ప్రత్యక్ష సాక్షులను ఉటంకిస్తూ జపాన్ మీడియా తెలిపింది. అనుమానితుడుగా భావిస్తున్న ఒక యువకుణ్ణి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని హైగో ప్రిఫెక్చర్‌కి చెందిన 24ఏళ్ల రియూజీ కిమురాగా గుర్తించారు. దాడి జరిగిన వెంటనే భద్రతా సిబ్బంది ప్రధానిని అక్కడి నుంచి తరలించారు. తొమ్మిది మాసాల క్రితం మాజీ ప్రధాని షింజో అబెను ఎన్నికల ప్రచార సందర్భంగా కాల్చి చంపిన సంగతి తెలిసిందే. స్థానిక ఎన్నికల్లో పాలక పార్టీ అభ్యర్థికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేసేందుకు కిషిదా వచ్చారు.. పోలీసులు ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారని చీఫ్ కేబినెట్ కార్యదర్శి మత్సునో చెప్పారు. ఈ సంఘటన వల్ల ఎన్నికల క్రమానికి ఆటంకం కలగబోదని మనందరం కలిసి ఎన్నికలను విజయవంతంగా నిర్వహించుకోవాలని కిషిదా చెప్పారు. సంవత్సరం వ్యవధిలో రెండవసారి చోటుచేసుకున్న ఈ దాడి అక్కడి పాలకవర్గాలపై ప్రజల్లో నెలకొన్న తీవ్ర అసంతృప్తికి ప్రతీకగా భావించాలా? శాంతి భద్రతల సమస్యగా చూడాలా అన్నదానిపై రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది.

51,042 పిడి ఖాతాల మూసివేత

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

గత రెండేళ్లుగా 51,042 పిడి ఖాతాలను (పబ్లిక్ డిపాజిట్) మూసివేసినట్లు రాష్ట్ర ఆర్థికశాఖ ప్రకటించింది. 37,140 ఖాతాలను మాత్రమే నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఇటీవల అకౌంటెంట్ జనరల్ కార్యాలయం అడిగిన ప్రశ్నలకు ఆర్థికశాఖ వివరణ పంపింది. అంతకముందు పిడి ఖాతాల నిర్వహణ లోపభూయిష్టంగా ఉన్నట్లు ఎజి కార్యాలయం అభ్యంతరం తెలిపిన సంగతి తెలిసిందే. గతంలో 88,182 పిడి ఖాతాలు ఉండగా, అందులో 43,955 ఖాతాలను 2021-22 ఆర్థిక సంవత్సరంలోనే మూసివేసినట్లు ఆర్థికశాఖ పేర్కొంది. మరో 7,087 ఖాతాలను 2022-23 ఆర్థిక సంవత్సరంలో మూసివేసినట్లు తెలిపింది. దీంతో 37,140 ఖాతాలు మాత్రమే ఉన్నాయని, వాటిని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లలో నిర్వహిస్తున్నామని పేర్కొంది. ఎక్కువగా ప్రభుత్వ పథకాలకే పిడి ఖాతాలు అమలు చేస్తున్నామని వివరించింది. అవి కూడా పారదర్శకతతో నిర్వహించేందుకు క్రమబద్ధీకరిస్తున్నట్లు తెలిపింది.

రబీ కొనుగోళ్లు ఏవీ?

కాకినాడ, ఏలూరులో ప్రారంభం కాని రబీ ధాన్యం సేకరణ

ప్రయివేట్ వ్యాపారులకు తెగనమ్ముకుంటున్న రైతులు



కాకినాడ జిల్లా యు కొత్తపల్లి మండలం నాగిలోపల్లిలో పొలాల్లో ఉంచిన ధాన్యం రాశి

ప్రజాశక్తి- కాకినాడ, ఏలూరు ప్రతినిధులు

ధాన్యం రైతులకు రబీలోనూ కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికే కాకినాడ, ఏలూరు జిల్లాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. అయినా, ప్రభుత్వం ఈ రెండు జిల్లాల్లో ధాన్యం కొనుగోలు ప్రారంభించలేదు. దీంతో, ఖరీఫ్‌లో మాదిరిగానే రబీలోనూ రైతులు దళారులకు తెగనమ్ముకోవాల్సి వస్తోంది. మద్దతు ధర రాక నష్టపోతున్నారు. కాకినాడ జిల్లాలో 12 రోజుల నుంచి రబీ కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెలాఖరులోగా కోతలు మొత్తం పూర్తి కానున్నాయి. ఈ జిల్లాలో రబీ సీజన్లో 2.16 లక్షల ఎకరాల్లో రైతులు వరిని సాగు చేశారు. సుమారు 5.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. గండేపల్లి మండలంలో 15 రోజుల క్రితమే కోతలు పూర్తి కాగా, యు.కొత్తపల్లి, ఏలేశ్వరం, పెదపూడి మండలాల్లో 50 శాతం, గొల్లప్రోలు, సామర్లకోట, కాజులూరు, ప్రత్తిపాడు, పిఠాపురం తదితర మండలాల్లో 35 శాతం పూర్తయ్యాయి. ఈ నెల 11న కరపలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినా ఒక్క ధాన్యం గింజ కూడా కొనుగోలు చేయలేదు. జిల్లాలోని మిగిలిన ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు.

సేకరణ లక్ష్యంపై స్పష్టత కరువు

కాకినాడ జిల్లాలో గతేడాది రబీ సీజన్లో 1.86 లక్షల ఎకరాల్లో వరి సాగవ్వగా 6.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. సుమారు 1,00,452 మెట్రిక్ టన్నులు స్థానిక అవసరాలకుపోగా 5,48,498 మెట్రిక్ టన్నులు సేకరించాలని అధికారుల లక్ష్యం పెట్టుకున్నారు. 311 ఆర్‌బికెల ద్వారా 2,59,708 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించారు. ఈసారి 5.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. 215 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించాలని భావిస్తున్నారు. అయితే, ఎంత సేకరించాలి, ఎప్పటి వరకూ కొనుగోలు చేయాలనేది అధికారులు ఇంకా తేల్చలేదు. వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని, పూర్తి స్థాయిలో కొనాలని రైతులు కోరుతున్నారు.

'పశ్చిమ', ఏలూరు జిల్లాల్లో సంచుల కొరత

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రబీలో దాదాపు మూడు లక్షల ఎకరాల్లో వరి వేశారు. ఈ జిల్లాల్లో కోతలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఏలూరు జిల్లాలో 3.90 లక్షల మెట్రిక్ టన్నులు, పశ్చిమ గోదావరి జిల్లాలో 9.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఏలూరు జిల్లాలో రెండు లక్షలు, పశ్చిమగోదావరి జిల్లాలో 6.47 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రబీలో ఎకరాకు 50 నుంచి 60 బస్తాల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఎకరాకు 40 కిలోల సంచులు వంద అవసరం అవుతాయి. ప్రభుత్వం మాత్రం 75 సంచుల నిబంధన విధించింది. అవసరం మేరకు సంచులు సరఫరా చేయాలని వ్యవసాయ శాఖాధికారులు ఇప్పటికే నివేదించినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. ధాన్యం సరఫరాకు లారీల కొరత కూడా తీవ్రంగా ఉంది. ధాన్యం సంచులు ఇంకా మిల్లర్ల వద్దే ఉన్నాయి. రైతు భరోసా కేంద్రం (ఆర్‌బికె)లకు చేరలేదు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఇప్పటికే కొనుగోలు ప్రారంభించామని, ఏలూరు జిల్లాలో ఆదివారం నుంచి ధాన్యం కొనుగోలు చేయనున్నామని అధికారులు చెప్తున్నారు.

వ్యాపారులకు అమ్మేసుకున్నాం..



16 ఎకరాలను కౌలుకు సాగు చేశాను. ఎకరాకు 30 బస్తాలు చొప్పున దిగుబడి వచ్చింది. నెల రోజుల క్రితమే కోతలు పూర్తయ్యాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో ప్రయివేటు వ్యాపారులకు ధాన్యాన్ని తక్కువ దరకు అమ్ముకోవాల్సి వచ్చింది. **వెంపాటి రాజు, కౌలు రైతు, గండేపల్లి, కాకినాడ జిల్లా**

బిజెపిని ఓడించడమే దేశభక్తి

- రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ ధ్వంసం చేస్తుంది
- ప్రజాస్వామ్యం రద్దు దిశలో మోడీ పాలన
- బాగేపల్లి సభలో ఏచూరి
- ఉత్సాహపూరితంగా సిపిఎం అభ్యర్థి అనిల్ నామినేషన్



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న సీతారాం ఏచూరి

ప్రజాశక్తి- బాగేపల్లి ప్రతినిధి

బిజెపి హయాంలో దేశంలో ప్రజాస్వామ్యం రద్దు చేయబడుతోందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో బిజెపిని ఓడించి దేశభక్తిని చాటుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. బాగేపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సిపిఎం అభ్యర్థిగా డాక్టర్ అనిల్ కుమార్ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా బాగేపల్లి పట్టణంలో నేషనల్ కాలేజీ నుంచి కెబిహెచ్ గ్రౌండ్స్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. నియోజకవర్గం పరిధిలోని అనేక గ్రామాల నుంచి పిల్లలు, 80 ఏళ్ల ముసలి వాళ్ల సైతం ఎర్ర జెండాలు చేతపట్టుకుని కదం తొక్కారు. సిపిఎం జిందాబాద్... అనిల్ కుమార్‌ను గెలిపించుకుందాం... అంటూ నినాదాలు చేస్తూ సాగిన ప్రదర్శనతో బాగేపల్లి పట్టణం ఎరుపెక్కింది.

అనంతరం సిపిఎం చిక్‌బళ్లాపూర్ జిల్లా కార్యదర్శి మునివెంకటప్ప అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీతారాం ఏచూరి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి మూల స్తంభాలైన లౌకికవాదానికి, సౌభ్రాతృత్వానికి, సామాజిక న్యాయానికి, ఫెడరలిజానికి ముప్పు తెచ్చిందన్నారు. రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన గవర్నర్ వ్యవస్థ, సిబిఐ, ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ వంటి వ్యవస్థలను రాజకీయ అంగాలుగా మార్చివేసిందని విమర్శించారు. ప్రభుత్వానికి అనుకూలంగా ఎవరు లేకపోయినా వారికి వ్యతిరేకంగా అవి పనిచేస్తున్నాయని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాలను ఈ వ్యవస్థల ద్వారా బిజెపి కూల్చివేస్తోందని, ఆ స్థానంలో బిజెపి ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తోందని అన్నారు. కర్ణాటక, గోవా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో మైనార్టీ ప్రభుత్వంగా ఉన్నప్పటికీ ఇతర పార్టీల నేతలను ఫిరాయింపజేసి అధికార పగ్గాలు చేపట్టిందని గుర్తు చేశారు. ఆర్థిక విధానాల్లోనూ కేంద్రం పేదలను కొట్టి పెద్దలకు కట్టబెట్టే చర్యలు చేపడుతోందన్నారు. పేదలపై

మిగతా 5లో

రాహుల్‌కు ఊరట

- ప్రత్యక్ష హాజరునుంచి కోర్టు మినహాయింపు

ముంబయి: మహారాష్ట్రలో నమోదైన ఓ పరువునష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ప్రత్యక్ష హాజరు నుంచి కోర్టు శాశ్వత మినహాయింపు ఇచ్చింది. తన న్యాయవాది ద్వారా రాహుల్ ఈ మేరకు దాఖలు చేసిన దరఖాస్తును పరిశీలించిన భివండీ ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ లక్ష్మీకాంత్ సి వాడికర్.. శాశ్వత మినహాయింపునకు రాహుల్ అర్హుడని పేర్కొన్నారు. జూన్ 3న ఈ కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలను నమోదు చేస్తామని తెలిపారు. 'తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు నిందితుడి(రాహుల్)కి కోర్టులో హాజరు నుంచి మినహాయింపు ఉంటుంది' అని ఉత్తర్వుల్లో పేర్కొంది. విచారణ తేదీల్లో రాహుల్ న్యాయవాది క్రమం తప్పకుండా, సరైన సమయానికి కోర్టు ముందు హాజరు కావాలని, న్యాయస్థానం ఆదేశించినప్పుడు నిందితుడూ రావాలని షరతులు విధించింది. మహాత్మాగాంధీ హత్యకు ఆర్‌ఎస్‌ఎస్ కారణమంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలు ఆ సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నాయంటూ 2014లో ఓ సంఘ్ కార్యకర్త భివండీ మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదు చేశారు. 2018 జూన్‌లో కోర్టుకు రాహుల్ హాజరయ్యారు. తనకు కోర్టులో ప్రత్యక్ష హాజరు నుంచి మినహాయింపు కావాలని గత ఏడాది కోరారు.

మహారాష్ట్రలో ఘోరం

- రాయ్‌గఢ్‌లో లోయలో పడిన బస్సు
- 13 మంది మృతి.. 29 మందికి గాయాలు

ముంబయి : మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్నది. బస్సు లోయలో పడిన ఘటనలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 29 మందికి గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 41 మంది ప్రయాణిస్తున్నారు. రాయ్‌గడ్ జిల్లా ఖోపోలీ ప్రాంతంలో గల పాత ముంబయి-పూణే రహదారిపై శనివారం ఉదయం ఐదు గంటలకు ఈ ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ముంబయిలోని గొరెగావ్ నుంచి శుక్రవారం అర్ధరాత్రి 1 గంట ప్రాంతంలో ప్రయివేటు ట్రావెల్స్ బస్సు బయలు దేరింది. పుణేలోని పింప్రి చిచ్వాడ్ ప్రాంతంలో ఒక ఈవెంట్ కోసం బాజి ప్రభు వాదక్ గ్రూపునకు చెందిన సాంప్రదాయ సంగీత బృందాన్ని బస్సు తీసుకెళ్తున్నది. అయితే, రహదారిపై బస్సు అదుపు తప్పి లోయలో పడిపోయింది. బస్సులో చిక్కుకున్నవారిని పోలీసులు రక్షించి, ఆస్పత్రికి తరలించారు. క్రేన్ సహాయంతో బస్సును బయటకు తీస్తున్నామని రాయ్‌గడ్ ఎస్‌పి సోమనాథ్ ఘార్గె తెలిపారు. ఈ ప్రమాదంలో మరణించిన వారు, గాయపడినవారు సియాన్, ముంబయిలోని గొరెగావ్, పాల్ఘర్ జిల్లా విరార్‌కు చెందినవారని చెప్పారు. వీరిలో చాలా మంది 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారని అదనపు ఎస్‌పి అతుల్ జెండే తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. గాయపడిన వారి వైద్య చికిత్సలకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని పేర్కొంది.

'108' ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

- రాష్ట్ర మహాసభలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ

లోపలి పేజీలో..

యుపిలో భయోత్పాతం

- గ్యాంగ్‌స్టర్లు అతీక్ అహ్మద్, అష్రఫ్ కాల్చివేత
- పోలీసుల కస్టడీలోనే కాల్పులు



లక్నో : ఉత్తరప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన ఉమేశ్ పాల్ హత్య కేసులో నిందితుడిగా ఉన్న గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్, ఆయన సోదరుడు అష్రఫ్ అహ్మద్‌లను గుర్తు తెలియని వ్యక్తులు కాల్చివేశారు. ఇద్దరినీ వైద్యం కోసం తీసుకొచ్చారు. ప్రయాగ్‌రాజ్ మెడికల్ కాలేజీ సమీపంలో ఈ హత్య జరిగింది. ఇద్దరి చేతులకు సంకెళ్లు ఉన్నాయి. పోలీసులు అతీక్ అహ్మద్‌ను వైద్య పరీక్షల నిమిత్తం కొల్విన్ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా ఈ దాడి జరిగింది. పోలీసులు, మీడియా సమక్షంలోనే వారిని గుర్తు తెలియని వ్యక్తులు కాల్చివేయడం గమనార్హం. జైశ్రీరామ్ అంటూ దుండగులు నినాదాలు చేసినట్లు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. అనంతరం దుండగులు పోలీసులకు లొంగిపోయారు.

గుల్హామ్ ఝాన్సీలో రాష్ట్ర స్పెషల్ టాస్క్ ఫోర్స్ గురువారం జరిపిన ఎన్‌కౌంటర్‌లో అతీఫ్ కుమారుడు అసద్, మరో నిందితుడు మరణించిన సంగతి తెలిసిందే. ఉమేశ్ పాల్ హత్య కేసులో విచారణ నిమిత్తం అతీక్ అహ్మద్‌ను ప్రయాగ్‌రాజ్ కోర్టులో గురువారం హాజరుపర్చారు. ఆ సమయంలోనే ఆయన తనయుడు ఎన్‌కౌంటర్‌లో మరణించగా, తాజాగా అతీక్ అహ్మద్ హత్యకు గురవడం గమనార్హం.

2005 నాటి బిఎస్‌పి శాసనసభ్యుడు రాజుపాల్ హత్యకేసులో ప్రధాన సాక్షిగా ఉన్న ఉమేశ్ పాల్, ఆయన ఇద్దరు అంగరక్షకులు ఫిబ్రవరి 24న పట్టపగలే కాల్చి చంపడం ఉత్తర ప్రదేశ్‌లో సంచలనం సృష్టించింది.

ప్రజల భద్రత పరిస్థితి ఏమిటి? : అఖిలేష్ యాదవ్


పోలీసుల భద్రతా వలయం మధ్య బహిరంగంగా కాల్పులు జరిగి చనిపోతే ప్రజల భద్రత పరిస్థితి ఏమిటని ఎస్‌పి అధినేత అఖిలేష్ యాదవ్ ప్రశ్నించారు. ఉత్తర ప్రదేశ్‌లో నేరాలు తారాస్థాయికి చేరుకున్నాయని, కావాలనే భయోత్పాత వాతావరణం సృష్టిస్తున్నారని ట్వీట్ చేశారు.

వెయ్యి కోట్లిచ్చానని చెప్తా..

ప్రధానిని అరెస్టు చేస్తారా?

- ప్రత్యర్థుల గొంతు నొక్కేందుకు దర్యాప్తు సంస్థల దుర్వినియోగం
- సిబిఐ సమన్ల నేపథ్యంలో కేజ్రీవాల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



ప్రధానికి వెయ్యి కోట్లిచ్చానని చెబుతా.. ఆయనను అరెస్టు చేస్తారా? అని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ దర్యాప్తు సంస్థలను సూటిగా ప్రశ్నించారు. అవినీతికి వ్యతిరేకంగా అసెంబ్లీలో మాట్లాడినప్పుడే సిబిఐ సమన్లు పంపుతుందనే విషయం తనకు తెలుసునని చెప్పారు. శనివారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఢిల్లీ ఎక్సైజ్ పాలసీకి సంబంధించి ఆదివారం ఉదయం 11 గంటలకు విచారణకు హాజరు కావాలని సిబిఐ సమన్లు పంపిందని, తప్పనిసరిగా హాజరవుతానని చెప్పారు. ఈ విధానాన్నే పంజాబ్‌లో అమలు చేయడం వల్ల ఆదాయంలో 50 శాతం పెరుగుదల కనిపించిందని, ఇది ఒక పారదర్శక, గేమ్ ఛేంజింగ్ పాలసీ అని తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకపోయినా కేంద్ర దర్యాప్తు సంస్థలు కోర్టులో తమపై అబద్ధాలు చెబుతున్నాయని విమర్శించారు. అరెస్టు చేసిన వ్యక్తులను థర్డ్ డిగ్రీ పద్ధతులతో చిత్రహింసలు పెడుతూ, మానసిక వేధింపులకు పాల్పడటం ద్వారా తమను ఇరుకున పెట్టాలని చూస్తున్నాయని అన్నారు. రాజకీయ ప్రత్యర్థుల గొంతు నొక్కేందుకు దర్యాప్తు సంస్థలను అసాధారణ స్థాయిలో దుర్వినియోగపరుస్తున్నారని మండిపడ్డారు. "కోర్టుకు దర్యాప్తు సంస్థలు తప్పుడు అఫిడవిట్లు సమర్పిస్తున్నాయి. 14 ఫోన్లను ధ్వంసం చేశామని చెప్పాయి. వాటిలో 4 ఇడి, 1 సిబిఐ వద్ద ఉన్నాయని సీజ్ మెమో చూపిస్తోంది. మిగతా ఫోన్లు చాలావరకూ వినియోగంలో ఉన్నాయి. వాటిని వాలంటీర్లు వినియోగిస్తున్నారని ఇడి, సిబిఐకి తెలుసు' అని విమర్శించారు. తన పేరు, సిసోడియా పేరు చెప్పాలని, తమకు పరిచయం లేని చందన్‌రెడ్డిని చిత్రహింసలకు గురి చేశారని తెలిపారు. చేయని నేరాన్ని అంగీకరించేలా అనుమానితులపై తీవ్ర బెదిరింపులకు దిగుతున్నారని, 'రేపు నీ కుమార్తె కళాశాలకు ఎలా వస్తుందో చూస్తా' అంటూ ఓ వ్యక్తిని బెదిరించారని విమర్శించారు. మరో వ్యక్తిని విచారిస్తున్నప్పుడు అతని భార్య, తండ్రిని మరో గదిలో కూర్చోబెట్టారని, వారిని జైలుకు పంపుతామని బెదిరించారని చెప్పారు. మద్యం విధానంలో మనీశ్ సిసోడియాపై సిబిఐ తప్పుడు ఆరోపణలు చేసిందని కేజ్రీవాల్ తెలిపారు.

ఎలాంటి ఆధారం లేకుండా సెప్టెంబర్ 17న రాత్రి ఏడు గంటల సమయంలో ప్రధాని మోడీకి నేను వెయ్యి కోట్ల రూపాయలు ఇచ్చా అని చెప్తా. అప్పుడు మీరు ప్రధానిని అరెస్టు చేస్తారా..?" అని కేజ్రీవాల్ ఘాటుగా ప్రశ్నించారు.



విశాఖ ఉక్కు రక్షణకు క్రౌడ్ ఫండింగ్

- జెడి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ ఉక్కును కాపాడుకోవడం ప్రజలందరి బాధ్యతని సిబిఐ మాజీ జెడి వివి.లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం ఆయన స్టీల్‌ప్లాంట్ సిజిఎం సత్యానంద్‌కు బిడ్డింగ్ పత్రాలను అందజేశారు. వర్కింగ్ క్యాపిటల్, ముడిసరుకు కోసం విశాఖ ఉక్కు పరిశ్రమ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్టు (ఆసక్తి వ్యక్తీకరణ) బిడ్లను ఆహ్వానించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన వెన్సెరా ఇంపెక్స్ అనే ప్రయివేట్ కంపెనీ ద్వారా బిడ్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కోసం 'క్రౌడ్ ఫండింగ్' ద్వారా నిధులు సమీకరించి కాపాడుకుందాం అని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 8.5 కోట్ల మంది నెలకు రూ.100 చొప్పున విరాళం ఇస్తే నెలకు రూ.850 కోట్లు జమ అవుతుందన్నారు. ఇలా నాలుగు నెలల పాటు చేయగలిగితే స్టీల్‌ప్లాంట్‌ను నిలబెట్టుకోవచ్చుని ఆయన తెలిపారు.

ఉక్కు బిడ్డింగ్‌కు 22 సంస్థలు

- ఈ నెల 20 వరకు ఇఒఐ గడువు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కొకింగ్ కోల్, ఐరన్ ఓర్ సరఫరా, వర్కింగ్ కేపిటల్ కోసం వైజాగ్ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం పిలిచిన టెండర్లకు అనూహ్య స్పందన లభించింది. సుమారు 22 కంపెనీలు శనివారం తమ బిడ్లను దాఖలు చేశాయి. బిడ్ వేసేందుకు సింగరేణి కాలరీస్ కంపెనీ ప్రతినిధులు ఐదురోజులు గడువు కోరడంతో ఈనెల 20 వరకు స్టీల్ యాజమాన్యం గడువు పొడిగించింది. మరికొన్ని కంపెనీలు కూడా బిడ్లను దాఖలు చేసే అవకాశముంది. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరాం ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎపి ప్రభుత్వం, సెయిల్, ఎన్ఎండిసి కూడా ఈ బిడ్‌లో పాల్గొనాలని కోరారు. ప్రయివేట్ వాళ్లకు వదిలేస్తే మార్కెటింగ్ నెట్‌వర్క్‌ను వాళ్లు కబ్జా చేస్తారని, భవిష్యత్‌లో స్టీల్‌ప్లాంట్‌కు తీరని నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చినట్టుగానే ఎపి ప్రభుత్వం కూడా స్పందించి కోట్ చేస్తే వైజాగ్ స్టీల్‌ప్లాంట్ విషయంలో వారి చిత్తశుద్ధి ఎంతో వెల్లడవుతుందని తాజాగా చర్చ జరుగుతోంది.

బిడ్డింగ్ దాఖలు చేసిన కంపెనీలు

విదేశీ కంపెనీలు యూరోప్ ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్, ఇండో ఇంటర్ ట్రేడ్, ఇండో ఇంటర్నేషనల్, ఐఎంఆర్ మాట్లేర్స్, టాటా ఇంటర్నేషనల్ లిమిటెడ్, ఉక్రెయిన్ దేశానికి చెందిన వబాంనోవంకీ అలెక్స్‌స్ట్రాతో పాటు స్వదేశానికి చెందిన జెఎస్‌డబ్ల్యు, జెఎస్‌పిఎల్, అగర్వాల్ కంఫర్ట్ ప్రైవేట్ లిమిటెడ్, ఎల్‌కెశ్రీ ఎంటర్‌ప్రైజెస్, ఎయుఒఎన్ స్టీల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, క్సిఅమెన్ సి అండ్ డి, సూరజ్ మాల్ యధానాధ, టియుఎఫ్ గ్రూప్, అగోర పార్టనర్స్, గ్లోబల్ సాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్, వెన్సెరా ఇంపెక్స్, హెచ్ఎస్ పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్, సంజయ్ సిన్హా, సందీప్ సలీం, ఎలెగంత్ మెటల్ అండ్ మినరల్, రూపేజ్ ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ కంపెనీలు బిడ్లను దాఖలు చేశాయి.

విద్యకు అధిక ప్రాధాన్యత

ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ప్రెస్ అకాడమీ ఛైర్మన కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. ఫిలాంత్రఫిక్ సొసైటీ ఆధ్వర్యాన విజయవాడలో జరిగిన కార్యక్రమంలో శనివారం ఆయన మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాలకు మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను 98.5 శాతం అమలు చేసిన వ్యక్తి సిఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ అకాడమీ కార్యదర్శి ఎం బాలగంగాధర్ తిలక్ పాల్గొన్నారు.

ఉప్పెనలా ఉక్కు సంకల్ప పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు

- పెదగంట్యాడ, కూర్మన్నపాలెం నుంచి సింహాచలం తొలి మెట్టు వరకూ నడక
- వందలాదిగా తరలొచ్చిన కార్మికులు
- అడుగడుగునా ప్రజా నీరాజనం

ప్రజాశక్తి - ఉక్కునగరం, గాజువాక, గోపాలపట్నం, సింహాచలం విలేకరుల బృందం

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా శనివారం విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన తలపెట్టిన ఉక్కు సంకల్ప పాదయాత్ర ఉప్పెనలా సాగింది. పెదగంట్యాడ, కూర్మన్నపాలెం జంక్షన్ల నుంచి వేర్వేరుగా బయలుదేరిన రెండు పాదయాత్రలు గాజువాక జంక్షన్‌లో ఒక్కటై మహా పాదయాత్రగా సింహాచలం తొలి మెట్టు వరకూ సాగాయి. సుమారు 27 కిలోమీటర్ల ఈ నడకలో మండుటెండలో వందలాది మంది ఉక్కు కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు, వివిధ పార్టీల, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు. కూర్మన్నపాలెం, పెదగంట్యాడ జంక్షన్ల నుంచి ఉదయం ఆరు గంటలకే పాదయాత్రలు ప్రారంభమై పాత గాజువాకలో కలిశాయి. అక్కడి నుంచి పంతులుగారి మేడ, బిహెచ్‌పివి, నాతయ్యపాలెం, అక్కిరెడ్డిపాలెం, షీలానగర్, విమానాశ్రయం, ఎన్ఎడి కొత్త రోడ్డు, బుచ్చిరాజుపాలెం, బాజీ జంక్షన్, గోపాలపట్నం, ప్రహ్లాదపురం, గోశాల మీదుగా సింహాచలం వరకు సాగింది. పాదయాత్ర చేస్తున్న వారిపై దారి పొడవునా ప్రజలు పూలు జల్లి స్వాగతం పలికారు. తాగునీరు, మజ్జిగ, పండ్లు అందజేశారు. పాదయాత్ర సమయంలో కొంతమంది ఎండకు కళ్లు తిరిగి పడిపోగా వారికి జనమే సపర్యలు చేశారు. విశ్రాంత ఉద్యోగులు సైతం పాదయాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపారు. పాదయాత్ర ఆద్యంతం 'సేవ్ వైజాగ్ స్టీల్, విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' నినాదాలతో మార్మోగింది. పాదయాత్రకు గాజువాకలో సిబిఐ మాజీ జెడి వివి.లక్ష్మీనారాయణ మద్దతు తెలిపి సింహాచలం వరకూ నడిచారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరిస్తే కేంద్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

పాదయాత్రకు పలువురి మద్దతు

మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, జనసేన పిఎసి సభ్యులు కోన తాతారావు, జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్లు డాక్టర్ బి.గంగారావు, దల్లి గోవింద సహా సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, వైసిపి, టిడిపి, జనసేన, ఆమ్‌ఆద్మీ, బిఆర్ఎస్ పార్టీలు, పలు ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. పాదయాత్ర బృందం సభ్యులు సింహాచలం చేరగానే సింహాద్రి అప్పన్న సోదరి పైడితల్లమ్మకు పసుపు కుంకమలు సమర్పించారు. అనంతరం సింహాచలం తొలి పావంచా వద్దకు చేరుకుని స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ బారి నుంచి కాపాడాలంటూ సింహాద్రి అప్పన్న విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. పాదయాత్రకు పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, ఎం రాజశేఖర్, కన్వీనర్ కెఎస్ఎన్.రావు, కో - కన్వీనర్లు జె.అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, నాయకులు రామస్వామి, వైటి.దాస్ నాయకత్వం వహించారు.

పోలవరంలో పురోగతి ఏది?

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టులో పురోగతి ఏది? అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రశ్నించారు. కేంద్ర జలశక్తిశాఖ నివేదిక ప్రకారం ఏడాదిలో 0.83 శాతం పనులు మాత్రమే జరిగాయని శనివారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. జలశక్తిశాఖ నివేదికపై సమాధానం చెప్పగలరా? అని సిఎంను ప్రశ్నించారు. కూల్చేవారికి కట్టడం ఎలా తెలుస్తుంది? విధ్వంసకారులకు విధానం ఏముంటుంది? అని ప్రశ్నించారు. ఇదేం కర్మ మన రాష్ట్రానికి అని ప్రజలు సరిపెట్టుకోవాలా? అని పేర్కొన్నారు.

డిఎంఇ (ఎఫ్ఎసి)గా నరసింహం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఇ, ఎఫ్ఎసి)గా డిఎస్‌విఎల్ నరసింహంను నియమిస్తూ జిఓ ఆర్‌టి నెంబరు 260ను ప్రభుత్వం శనివారం విడుదల చేసింది. ప్రస్తుతం కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో రెగ్యులర్ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నారు. తాజాగా డిఎంఇగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఈ పదవిలో కొనసాగుతారని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

నోరెత్తితే నోటీసులా?

- ప్రభుత్వ తీరుపై సర్వత్రా ఆగ్రహం
- రేపు నిరసనలకు న్యాయవాదుల పిలుపు

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడిన సీనియర్ న్యాయవాదులు, జర్నలిస్టులు, ఆడిటర్లకు సిఐడి నోటీసులు పంపడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. మార్గదర్శి అకౌంటెంట్ అరెస్టుపై వేర్వేరు సంస్థల ఆధ్వర్యాన ఈ నెల రెండోతేదీన నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి పలు సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు హాజరయ్యారు. వారిలో ఛార్టర్డ్ ఎకౌంటెంట్లు నేతి పరమేశ్వరరావు, శ్రీరామ్, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, న్యాయవాదులు సుంకర రాజేంద్రప్రసాద్, ముప్పాళ్ల సుబ్బారావు, గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, జడా శ్రావణ్‌కుమార్, ఎపి జర్నలిస్టు ఫోరం నాయకులు చెవుల కృష్ణాంజనేయులు, ప్రొగ్రెసివ్ ఫోరం నాయకులు పివి మల్లికార్జునరావు, మాజీ అధికారి ఉప్పులేటి దేవీప్రసాద్ తదితరులు ఉన్నారు. దీనిలో ఎపి బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 'వైద్యులు ఎలా వైద్యం చేయాలో, జర్నలిస్టులు ఎలా వార్తలు రాయాలో, సిఎ ఎలా లెక్కలు రాయాలో పోలీసులే చెబుతున్నారు' అనే వ్యాఖ్యానంతోపాటు పలు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. వాటిపై వివరణ ఇవ్వాలని సిఐడి అదనపు ఎస్‌పి రాజశేఖరరావు సుంకర రాజేంద్రప్రసాద్‌కు నోటీసు ఇచ్చారు. ఆయనతోపాటు ఈ నోటీసులు అందరికీ జారీచేశారు. వారి అభిప్రాయాలు చెప్పడమే నేరంగానూ, విచారణకు అడ్డంకిగానూ భావించి సిఐడి వారికి నోటీసులు జారీచేసింది. విచారణ సమయంలో ఇలాంటి ప్రకటనలు ప్రభావితం చేస్తాయని, ఎందుకు చేశారో చెప్పాలని, ఆధారాలు ఇవ్వాలని సిఐడి అధికారులు నోటీసులో పేర్కొన్నారు. దీనిపై ఎవరికి వారు ప్రతి స్పందించారు. తాను వ్యక్తం చేసిన అభిప్రాయంపై ఎటువంటి ఆధారాలు ఇవ్వాల్సిన అవసరం లేదని సిఐడికి రాజేంద్రప్రసాద్ సమాధానం పంపారు. భావ వ్యక్తీకరణను అడ్డుకోవడం నియంతృత్వమేనని న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ తెలిపారు. మచిలీపట్నం బార్ అసోసియేషన్ నిరసనకు పిలుపునిచ్చింది. దీనిపై ఆలిండియా లాయర్స్ యూనియన్ కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక అభిప్రాయం చెబితే దానికి ఆధారాలు ఇవ్వాలని అనడం సరైంది కాదని పేర్కొంది. దీనిపై సోమవారం కృష్ణా జిల్లా వ్యాప్తంగా కోర్టుల వద్ద న్యాయవాదులు నిరసనలు వ్యక్తం చేయనున్నారు. అనంతరం అన్ని జిల్లాల్లోనూ, హైకోర్టు వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టడంతోపాటు పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కోడికత్తికి ఏమైంది?

- రేపటి వాయిదాపై ఉత్కంఠ
- సంచలనం రేపిన శ్రీనివాస్ ప్రకటన
- ఇప్పటి వరకు హాజరుకాని బాధితుడు
- సానుభూతి కోసం చేశానన్న నిందితుడు
- అధికార, ప్రతిపక్షం మధ్య మాటల తూటాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కోడికత్తి కేసు సంచలనమైంది. వైసిపి అధికారంలోకి రావడం కోసమే కోడికత్తితో దాడి చేశానని నిందితుడు శ్రీనివాసరావు చెప్పినట్లు వచ్చిన వార్తలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. ఈ నెల 17కు ఎన్ఐఎ కోర్టు విచారణ వాయిదా వేసింది. అదేరోజు దీనిపై తుదితీర్పు వచ్చే అవకాశం ఉంది. ఇక ముందు విచారణ అవసరం లేదని ఎన్ఐఎ కూడా కోర్టుకు నివేదించింది. తనకు అడ్వకేట్ కమిషనర్‌ను వేసి తన అభిప్రాయం తీసుకోవాలని సిఎం మరో పిటిషన్ వేశారు. దీన్ని కొట్టివేయాలని, ఇక ముందు ప్రత్యేక విచారణ అవసరం లేదని ఎన్ఐఎ తరుపు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. అయితే బాధితుడు కోర్టుకు వచ్చి పిటిషన్ వేయడంపై పూర్తి వివరణ ఇవ్వాలని కోర్టు బాధితుడిగా ఉన్న ప్రస్తుత సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆదేశించింది. తాను రావడం వల్ల ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని, మినహాయింపు ఇవ్వాలని కోర్టును సిఎం కోరారు. విచారణ మొదలైన తరువాత ఇంతవరకు కోర్టుకు హాజరు కాకపోవడం సరైంది కాదని కోర్టు కూడా అసహనం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో 17న జరిగే విచారణలో కోర్టు తీర్పు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. దీనిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

అప్పట్లో ఈ ఘటనపై రాజకీయ విమర్శలు రావడంతో కేసును ఎన్ఐఎకి అప్పగించారు. దీనిపై ఎన్ఐఎ కూడా రాజకీయ కోణం లేదని తేల్చినట్లు వార్తలు వచ్చాయి. విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో నిందితుడు శ్రీనివాసరావు అప్పటి ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై 2018 అక్టోబరు 25న కోడికత్తితో దాడి చేశారు. తనపై హత్యాయత్నం జరిగిందని, తప్పుకోవడంతో చేతిపై గాయం అయిందని జగన్ ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు. ఘటన జరిగిన సమయంలో నిందితుడు టిడిపి అభిమాని అని ప్రచారం జరిగింది. వాస్తవంగా ఆయన వైసిపి కార్యకర్తేనని ముమ్మిడివరం సమీపంలోని ఆయన గ్రామ ప్రజలు కూడా తెలిపారు. ఈ కేసులో బాధితుడు, ఫిర్యాదుదారు అయినా ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ కోర్టుకు హాజరుకాలేదు. తనకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ క్రమంలో ఎన్ఐఎ కోర్టుకు సమర్పించిన విచారణ నివేదికలో పలు ఆసక్తికర అంశాలు చోటుచేసుకున్నాయి. నిందితుడు శ్రీనివాసరావు తాను జగన్‌కు సానుభూతి రావాలనే ఉద్దేశంతోనే స్టెరిలైజ్ చేసిన కత్తితో చేతిపై గాయం చేశానని, పోలీసులు కూడా తనపై రాజకీయ కోణంలో విచారణ జరపలేదని ఎన్ఐఎకి చెప్పినట్లు వార్తలు వచ్చాయి. విచారణ సమయంలో తనను పోలీసులు కొట్టారని, అయినా తాను చెప్పదలుచుకున్నదే చెప్పానని కోర్టుకు శ్రీనివాసరావు తెలిపారు. ప్రస్తుతం దీనిపైనే రాజకీయ రచ్చ మొదలైంది. అధికార వైసిపిలో ఉన్న సీనియర్ మంత్రులు, ప్రతిపక్షం టిడిపి నాయకులు వాదులాటకు దిగారు. శనివారం రాష్ట్రంలో అన్నిచోట్లా ఇదే అంశంపై పరస్పర విమర్శలకు దిగారు. కావాలని కోడికత్తితో దాడి చేయించుకున్నట్లు గతంలో తాము చెబితే విమర్శించారని, ఇప్పుడు అదే నిజమైందని టిడిపి నాయకులు విమర్శించగా, అలిపిరి ఘటన చంద్రబాబు అడిగి చేయించుకున్నారా? అని మంత్రులు ప్రతి విమర్శకు దిగారు.

ఇపిఎఫ్ పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి

- ఎపిఆర్‌పిఎ గౌరవ అధ్యక్షులు అజయ్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇపిఎఫ్-95 పెన్షనర్లందరికీ డిఎతో కలిపి కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆలిండియా కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఇపిఎఫ్ పెన్షనర్స్ అసోసియేషన్స్ పిలుపు మేరకు ఈ నెల 20న రాష్ట్రంలోని పార్లమెంటు సభ్యుల ఇళ్లవద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. హయ్యర్ పెన్షన్ కోసం హయ్యర్ ఆప్షన్ అమలు చేయాలని, ఇది పొందేందుకు అందరికీ అనుమతివ్వాలని డిమాండ్ చేశారు. సభకు అధ్యక్షత వహించిన అసోసియేషన్ నాయకులు ఎన్ఎ శాస్త్రి మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో పెన్షనర్ల సమస్యలపై ప్రస్తావించాలని కోరుతూ ఎంపిలకు వినతిపత్రాలు అందించాలని తెలిపారు. అదనపు వేతనం పొందుతున్న వారికి అదనపు ఆప్షన్ అనుమతించాలని, సీనియర్ సిటిజన్లకు రైల్వే ప్రయాణాల్లో రాయితీలు కల్పించాలని, ఇపిఎఫ్ పెన్షనర్లందరికీ వైద్య సదుపాయం ఉచితంగా అందించాలని సమావేశంలో తీర్మానించారు. కనీస పెన్షన్ పొందలేని ఇపిఎఫ్ పెన్షనర్లకు సామాజిక పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె సత్తిబాబు, కోశాధికారి సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.



భూములు స్వాధీనం చేసుకున్నఅనంతరం మాట్లాడుతున్న వి.వెంకటేశ్వర్లు

కోగిరలో భూస్వాధీన పోరాటం

- పొలాల్లో ఎర్రజెండాలు పాతి నిరసన
- ప్రయివేటు సంస్థకు అప్పగించే కుట్ర : వి. వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-రొద్దం (సత్యసాయి)

శ్రీ సత్యసాయి జిల్లా రొద్దం మండల పరిధిలోని కోగిర సమీపం కొండ ప్రాంతంలో పేదల సాగు చేసుకుంటున్న భూములను స్వచ్ఛంద సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం కట్టపెడుతున్న నేపథ్యంలో ఆ భూములను స్వాధీనం చేసుకునేందుకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం పేదలు భూ పోరాటం నిర్వహించారు. ఎర్రజెండాలు పాతి భూములను స్వాధీనం చేసుకున్నారు. వ్యకాసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, సిపిఎం సత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న తదితరులు సాగుదారులతో కలిసి పొలాల్లోకి వెళ్లారు. ఈ సమయంలో అక్కడున్న టింబక్టివ్ కలెక్టివ్ అనే స్వచ్ఛంద సంస్థ ప్రయివేటు రౌడీలతో వ్యకాసం నాయకులు, పేదలను బలవంతంగా అడ్డుకునే ప్రయత్నం చేసింది. వారిని ఎదిరించి ఆ భూముల్లో ఎర్రజెండాలు నాటారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కోగిర సమీపం కొండ ప్రాంతంలో ఉన్న భూములను కోగిర, కంబాలపల్లి, శ్యాంపురం గ్రామాలకు చెందిన దళిత, గిరిజన, నిరుపేద బిసి రైతులు దశాబ్దాల నుంచి సాగుచేసుకుంటున్నారని తెలిపారు. పేదల అనుభవంలో ఉన్న కోగిర రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 666 నుంచి 669 వరకు దాదాపు 4500 ఎకరాల భూమిని ప్రభుత్వం, అధికారులు టింబక్టివ్ కలెక్టివ్ అనే ప్రయివేటు సంస్థకు దొడ్డిదారిని అప్పజెప్ప కుట్ర జరుగుతోందన్నారు. సెక్యూరిటీ పేరుతో పేదలను భూముల్లోకి రానివ్వకుండా టింబక్టివ్ సంస్థ దౌర్జన్యాలకు పాల్పడుతోందని విమర్శించారు. ఈ విషయంలో అధికారులు స్పందించకుంటే ఖరీఫ్‌లో తామే దగ్గరుండి రైతులతో పొలాలను సాగు చేయిస్తామన్నారు. భూమిలేని ప్రతి పేదవాన్ని గుర్తించి వారికి భూమిని పంచతామని తెలిపారు. బాధితులకు భూమి దక్కేంత వరకు సిపిఎం, వ్యకాసం పోరాటం సాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్రాముడు, నారాయణ, 200 మంది సాగుదారులు పాల్గొన్నారు.

కుట్రలు.. వక్రీకరణలు వైసిపికే చెల్లు

- విరుచుకుపడ్డ టిడిపి నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కుట్రలకు పాల్పడటం, వాటిని ఎదుటివారికి అంటగట్టడం, వక్రీకరణలకు పాల్పడి తప్పుడు ప్రచారం చేయడం వైసిపి నైజమని టిడిపి నాయకులు పలువురు మీడియా సమావేశాల్లోనూ, పత్రికా ప్రకటనల్లోనూ పేర్కొన్నారు. కోడికత్తి కేసును అలిపిరి బాంబు బ్లాస్ట్‌తో ముడిపెట్టడం జగన్ కుట్రల నుంచి ప్రజల దృష్టి మళ్లించే ఎత్తుగడ కాదా? అని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. వ్యవస్థల్ని మేనేజ్ చేయగల అధికారం జగన్‌కే ఉందని, అందుకే అవినీతి కేసుల్లో నాలుగేళ్లుగా కోర్టు వాయిదాలకు హాజరవ్వడం లేదని తెలిపారు. టిడిపి నాయకుల ముసుగులో ప్రజల్ని రెచ్చగొట్టడమే ధ్యేయంగా, ప్రాంతాలు, మతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టేలా కొందరు ఫేక్ వీడియోలతో విద్వేషాలు రాజేస్తున్నారని మరో పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. దీనివెనుక వైసిపి నేత సజ్జల రామకృష్ణారెడ్డి హస్తముందని ఆరోపించారు.

'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళితులకు పొడిచింది, పీకింది ఏమి లేదు' అని తమ పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేష్ విమర్శిస్తే..వాటిని వక్రీకరించి దళితులకు వ్యతిరేకంగా మాట్లాడినట్టుగా వైసిపి నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని టిడిపి ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామి ఇంకో ప్రకటనలో పేర్కొన్నారు. కుట్రపూరితంగానే లోకేష్ వ్యాఖ్యలను 'సాక్షి' వక్రీకరించిందని ఆయన ఆరోపించారు. టిడిపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆ పార్టీ అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ కూడా ఇదే విషయం చెప్పారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాకే దళితులపై ఎన్నడూలేని దుర్మార్గాలు, దారుణాలు జరిగాయని టిడిపి అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు విమర్శించారు. జగన్ పాలనలో దళితులపై జరిగిన దారుణాలపై సిఎం, మంత్రులు బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.



రామనాథం భౌతికకాయంపై అరుణ పతాకాన్ని కప్పుతున్న సిపిఎం నాయకులు వి.శ్రీనివాసరావు, పి.మధు, సిహెచ్.బాబూరావు తదితరులు

సిపిఎం సానుభూతిపరుడు వై రామనాథం కన్నుమూత

- వైద్య కళాశాలకు భౌతికకాయం అప్పగింత

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్



రామనాథం (ఫైల్)

సిపిఎం సానుభూతిపరుడు యార్లగడ్డ రామనాథం (90) శనివారం ఉదయం వృద్ధాప్యం కారణంగా విజయవాడ మొగల్రాజపురంలోని తన స్వగృహంలో కన్నుమూశారు. ఆటోమొబైల్ వ్యాపార రంగంలో రామనాథం 40 ఏళ్ల ప్రఖ్యాతిగాంచారు. ఆక్వా డెవిల్స్ అసోసియేషన్ సభ్యులుగా వ్యవహరించారు. భార్య కస్తూరి గతంలోనే కన్నుమూశారు. రామనాథం దంపతులకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు సుబ్బారావు ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) పూర్వ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించారు. రెండో కుమారుడు వై.వెంకటేశ్వరరావు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా, మూడో కుమారుడు వై.రమేష్ మెట్రో ట్రేడర్స్ అధినేతగా ఉన్నారు. రామనాథం భౌతికకాయాన్ని వైద్య పరిశోధనల నిమిత్తం సాయంత్రం 4 గంటలకు ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలకు కుటుంబ సభ్యులు అప్పగించారు.

రామనాథం భౌతిక కాయాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు పి.మధు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు తదితరులు ఆయన భౌతికకాయంపై పార్టీ పతాకాన్ని కప్పి నివాళులర్పించారు. విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహనరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, చీఫ్ జనరల్ మేనేజర్ వై.అచ్యుతరావు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.మురళీకృష్ణ, కె.స్వరూపరాణి, దోనేపూడి కాశీనాథ్, సిపిఎం కృష్ణా జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, మాజీ ఎంపి గోకరాజు గంగరాజు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్ర ప్రసాద్, వైసిపి విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దేవినేని అవినాష్, ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.వి. ఈశ్వరరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, ఐద్వా నాయకులు పి.విజయ, సిపిఎం మొగల్రాజపురం డివిజన్ కార్యదర్శి పి.మురహరిరావు, ఆటోనగర్ ఐలా చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్, ఐలా కార్యదర్శి అన్నే శివనాగేశ్వరరావు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ సంతాపం

ఫోన్లో పరామర్శించిన ఏచూరి, రాఘవులు

యార్లగడ్డ రామనాథం మృతికి సిపిఎం రాష్ట్ర కమిటీ సంతాపం తెలిపింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. వై.వెంకటేశ్వరరావును పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, ఐద్వా జాతీయ నాయకులు ఎస్.పుణ్యవతి ఫోన్లో పరామర్శించారు. పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్, సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ సంతాప సందేశాలు పంపారు.

రాష్ట్రాభివృద్ధిపై టిడిపికి చిత్తశుద్ధి లేదు

- అందుకే విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లడం లేదు : మంత్రి బొత్స

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

రాష్ట్రాభివృద్ధిపై టిడిపికి చిత్తశుద్ధి లేకపోవడం వల్లే విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లడం లేదని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. విశాఖ ఉక్కును ప్రయివేటీకరణ కాకుండా ఆపుతామని, ఆ నమ్మకం తమకుందని చెప్పారు. శ్రీకాకుళంలోని ఒక హోటల్‌లో ఆయన శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం వాళ్ల హడావుడి చేయగానే కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ విషయంలో వెనక్కి తగ్గిందంటూ అసత్య ప్రచారాలు చేయడం సరికాదన్నారు. బిఆర్ఎస్ నేతలు చెప్పిన్న మాటలు వాస్తవాలు కావని తెలిపారు. విశాఖ ఉక్కు నుంచి పెట్టుబడులను ఉపసంహరిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసిన నాటి నుంచి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దీనిని ఆపేందుకు అనేక ప్రయత్నాలు చేశారని, ప్రధాని నరేంద్ర మోడీని పలుమార్లు కలిశారని తెలిపారు. భావనపాడు పోర్టు భూములను అదానీకి అప్పగించడానికే ప్రభుత్వం హడావుడి చేస్తోందన్న విలేకరుల ప్రశ్నకు ఆయన బదులిస్తూ, ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నప్పుడు ఈ పోర్టు గురించి ఎందుకు బాధ్యత తీసుకోలేదని ప్రశ్నించారు. పోర్టును కాదంటే చరిత్రహీనులుగా మిగిలిపోతారన్నారు. కోడికత్తి కేసు విషయంలో ఎన్ఐఎ నివేదికను వక్రీకరించడం సరికాదని చెప్పారు. ఎన్నికల్లో సానుభూతి కోసమే కోడికత్తి డ్రామా ఆడినట్లుగా టిడిపి ఆరోపించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఎన్నికల్లో సానుభూతి కోసమే 2003లో అలిపిరిలో చంద్రబాబు తనపై దాడి చేయించుకున్నారా? అని ప్రశ్నించారు. సమావేశంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, గొర్లె కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

డిఎస్‌సి-1998 నియామకాల్లో రిజర్వేషన్ పాటించాలి

- కెవిపిఎస్ రౌండ్‌టేబుల్ సమావేశంలో డిమాండ్
- 24న రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిఎస్‌సి-1998 నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్లు పాటించాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు డిమాండ్ చేశారు. అర్హత సాధించిన అభ్యర్థులందరికీ ఉద్యోగాలు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 24న రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. డిఎస్‌సి-1998 నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలని కోరుతూ కెవిపిఎస్ ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశం శనివారం జరిగింది. సంఘం ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి అధ్యక్షతన ఎంబి విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. 1998 డిఎస్‌సిలో అర్హత సాధించిన అభ్యర్థులు ఉద్యోగం కోసం 25 ఏళ్ల నుంచి అనేక నిరసనలు, పోరాటాలు చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 4,534 పోస్టులు భర్తీ చేస్తామని 6,754 మంది సర్టిఫికెట్లను పరిశీలన చేసిందని తెలిపారు. మరలా 4,072 పోస్టులు మాత్రమే భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రాజ్యాంగబద్ధంగా ఉద్యోగాల భర్తీ చేయాలని కోరారు. రోస్టర్ కం మెరిట్‌ను పాటించాలని, ఆ ప్రకారమే జాబితా తయారు చేయాలని కోరారు. వెరిఫికేషన్ చేసిన జాబితాను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డిహెచ్‌పిఎస్ ప్రధాన కార్యదర్శి కె సుబ్బారావు, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు, డివైఎఫ్ఐ కార్యదర్శి జి రామన్న, రెల్లి సంక్షేమ సంఘం నాయకులు నాగేంద్ర, బిసి సంక్షేమ సంఘం నాయకులు అప్పారావు, కిరణ్, కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి నటరాజు, నాయకులు సిహెచ్ శ్రీనివాసులు, 1998 డిఎస్‌సి అభ్యర్థులు పాల్గొన్నారు.

మాగుంట రాఘవ్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం విధానంలో నిందితునిగా తీహార్ జైలులో ఉన్న వైసిపి ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి కుమారుడు మాగుంట రాఘవ్ బెయిల్ పిటిషన్‌పై తీర్పును రౌస్ అవెన్యూలోని సిబిఐ ప్రత్యేక కోర్టు ఈ నెల 20కి వాయిదా పడింది. ఢిల్లీ మద్యం విధానంలో ఫిబ్రవరి 10న ఇడి అధికారులు రాఘవ్‌ను అరెస్టు చేసి సిబిఐ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపర్చగా, ప్రత్యేక జడ్జి ఆయనను పది రోజులు ఇడి కస్టడీకి విధించారు. అప్పటి నుంచి పలు దఫాలుగా ఆయన కస్టడీని న్యాయస్థానం పొడిగించింది. ఢిల్లీ మద్యం విధానంలో ఇడి ఈ నెల 6న దాఖలు చేసిన అనుబంధ చార్జిషీటు పరిగణనలోకి తీసుకునే విషయాన్ని 24న వెల్లడిస్తామని ఢిల్లీ అవెన్యూలోని సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం స్పష్టం చేసింది.

డ్యూటీ సర్టిఫికెట్ ఆధారంగా రైతు మిత్రలకు గౌరవ వేతనాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా 10,778 వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రాల్లోని రైతు మిత్రలకు ఇకపై గౌరవేతనం డ్యూటీ/హాజరు ధ్రువీకరణ పత్రం ఆధారంగా చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను జిల్లాల కలెక్టర్లకు గ్రామ, వార్డు సచివాలయాలశాఖ జారీ చేసింది. ఆర్‌బికెలకు సంబంధించిన వివిఎ (విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్) జారీ చేసిన డ్యూటీ సర్టిఫికెట్‌కు గౌరవ వేతనానికి ప్రభుత్వం లింక్ పెట్టింది. రైతుల ఇంటి వద్దకే నాణ్యమైన ఇన్‌పుట్ సబ్సిడీల పంపిణీని నిర్ధారించడానికి, రైతు కేంద్రాలు ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ మినహా ఎవరినీ ఆర్‌బికెలకు కేటాయించకపోవడంతో పనిభారం పెరిగిందని ప్రభుత్వం దృష్టికి వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనరు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ప్రతి రైతు భరోసా కేంద్రానికి ఒక వాలంటీరును కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది.

పొత్తులపై నిర్ణయం తీసుకోలేదు

- జనసేన నేత నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

పొత్తుల విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నిర్ణయిస్తారని జనసేన పార్టీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. కర్నూలులోని విజయ గ్రాండ్ హోటల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లీగల్ సెల్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 35 మహిళా పోలీస్ స్టేషన్లలో వీర మహిళల కోసం మహిళా న్యాయవాదులను ఏర్పాటు చేశామన్నారు. రాబోయే ఎన్నికలకు జనసేనను సిద్ధం చేయడానికి పది రోజుల్లో మండల అధ్యక్షుల ఎన్నిక నిర్వహిస్తామని తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు అందిస్తున్న సాయం రెండవ దశ ఆదోని, మంత్రాలయం ప్రాంతాల్లో ఉంటుందన్నారు. 2022 అక్టోబర్ 12న ప్రమాదంలో మరణించిన జనసైనికులు శ్రీనివాస్ కుటుంబసభ్యులకు రూ.ఐదు లక్షల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర నాయకులు కల్యాణం శ్రీనివాసరావు, మధుసూదన్ రెడ్డి, అనంతపురం జిల్లా నాయకులు, వివిధ జిల్లాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘108’ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

రాష్ట్ర మహాసభలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం (పశ్చిమగోదావరి)

108 ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయకుండా, ఉద్యోగ భద్రత కల్పించకుండా పదిహేడు ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం వారితో వెట్టిచాకిరీ చేయించుకోవడం దుర్మార్గమని ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని గుణ్ణం ఫంక్షన్ హాలులో 108 కాంట్రాక్టు ఉద్యోగుల రాష్ట్ర మహాసభ శనివారం జరిగింది. ఈ మహాభకు ముఖ్య అతిథిగా షేక్ సాబ్జీ, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ప్రభుత్వ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర జెఎసి కార్యదర్శి నూర్‌మహ్మద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సాబ్జీ మాట్లాడుతూ ప్రజలకు విలువైన సేవలందిస్తున్న ఇఎంఆర్, జివికె, బివిజి, అరబిందో సంస్థల కాంట్రాక్టులను రద్దు చేసి ప్రభుత్వమే 108 వ్యవస్థను కొనసాగించాలని డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3,500 మంది 108 కాంట్రాక్ట్ ఉద్యోగులు నిరంతరం చాలీచాలని వేతనాలతో ప్రజలకు అనేక సేవలందిస్తున్నారని తెలిపారు. రోజుకి 12 గంటలు పని చేస్తూ నెలకు రూ.15 వేలు మాత్రమే వేతనంగా పొందుతున్నారని, కొంతమందికి రూ.28 వేలు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చెప్పినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను మోసం చేస్తోందని అన్నారు. మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహారావు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా హాజరైన ప్రతినిధులు ఈ నివేదికపై చర్చించి ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ

బిజెపి నాయకులపై చర్యలు తీసుకోండి

- అనంతలో ఉద్యోగ,ఉపాధ్యాయ జెఎసి నాయకుల నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం కార్పొరేషన్ అధికారులపై బిజెపి నేతల నోటి దురుసు, దాడిపై జిల్లా వ్యాప్తంగా సర్వత్రా నిసనాగ్రహం పెల్లుబికింది. అధికారులను ‘బట్టలూడదీసి కొడతా’ అంటూ అవమానకరంగా మాట్లాడిన బిజెపి నాయకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఐక్య ఉద్యోగ, ఉపాధ్యాయ జెఎసి ఆధ్వర్యంలో ఉద్యోగులు శనివారం ఉదయం కార్పొరేషన్ కార్యాలయం నుంచి డిఎస్‌పి కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అక్కడే బైటాయించి ధర్నా చేశారు. సిఐటియు, పలు ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్లాస్టిక్ నిషేధ చట్టాన్ని అమలు చేస్తున్న అనంతపురం నగర పాలక సంస్థ అధికారులను బిజెపి నాయకులు లలిత్‌కుమార్, ఫయాజ్ బూతులు తిట్టడం దుర్మార్గం అన్నారు. చట్టాన్ని అమలు చేసే అధికారులను తులనాడిన తీరు సభ్యసమాజం తలదించుకునేదిలా ఉందని తెలిపారు. అనంతపురంలో నిషేధం విధించిన ప్లాస్టిక్ వస్తువులను అమ్ముతున్న వ్యాపారులతో బిజెపి నేతలు లోపాయికారీ ఒప్పందం చేసుకున్నట్లు వారి చర్యలను బట్టి స్పష్టంగా అర్థమవుతోందని దుయ్యబట్టారు. అధికారులపై అనుచితంగా ప్రవర్తించిన బిజెపి నాయకులపై తక్షణమే కేసులు నమోదు చేసి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఎస్‌పి కార్యాలయంలో సిఐ జాకీర్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సిపిఎం నాయకులు ఆర్‌వి.నాయుడు, సిఐటియు నగర కార్యదర్శి వెంకట నారాయణ, మూర్తుజా, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



అనంతపురం డిఎస్‌పి కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ జెఎసి, సిఐటియు నాయకులు

వివేకా హత్య కేసులో ఆధారాలు చెరిపివేత

- విచారణకు ‘ఉదయ్’ సహకరించడం లేదు
- రిమాండ్ రిపోర్టులో పేర్కొన్న సిబిఐ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో ఆధారాలు చెరిపివేసేందుకు ఉదయ్ కుమార్‌రెడ్డి ప్రయత్నించాడని ఆయన రిమాండ్ రిపోర్టులో సిబిఐ పేర్కొంది. ‘సంఘటనా స్థలానికి ఉదయ్ కుమార్‌రెడ్డి, వైఎస్.అవినాష్‌రెడ్డి, వైఎస్.భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి వెళ్లాడు. ఆధారాలను చెరిపి వేయడంలో ఉదయ్ కుమార్ కీలక పాత్ర పోషించాడు. వివేకా మృతదేహాన్ని బాత్రూం నుంచి బెడ్ రూమ్‌కి ఉదయ్ కుమార్ మార్చారు. తన తండ్రి ప్రకాష్‌రెడ్డితో గాయాలకు కుట్లు వేయించి ఆధారాలను చెరిపేసే ప్రయత్నం చేశారు. గుండెపోటుతో మరణించాడని చెప్పడంలో ఉదయ్ కీలక పాత్ర పోషించారు. విచారణకు ఉదయ్ కుమార్ సహకరించడం లేదని’ సిబిఐ తన రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నట్లు సమాచారం.

శివశంకర్‌రెడ్డి భార్య పిటిషన్ విచారణ

మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో తన భర్తను అన్యాయంగా ఇరికించారని దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి భార్య తులసమ్మ వేసిన ప్రయివేటు కేసును వాదించడానికి పిటిషనర్ తరఫున హైకోర్టు న్యాయవాదులు శనివారం పులివెందుల కోర్టుకు వచ్చారు. వాదోపవాదనల అనంతరం విచారణను మే ఆరో తేదీకి న్యాయమూర్తి పవన్‌కుమార్ వాయిదా వేశారు. తన భర్తకు సంబంధం లేకున్నా కేసులో ఇరికించారని, వివేకా అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డితో పాటు మరో నలుగురిని విచారించాలని పిటిషనర్ ఫిబ్రవరి 21న ప్రయివేటు కేసు వేశారు. మొదటి విచారణ మార్చి 25న జరిగింది. ఈ విచారణలో సాక్షిగా వివేకా పిఎ కృష్ణారెడ్డి స్టేట్‌మెంట్‌ను న్యాయమూర్తి రికార్డు చేశారు.

తప్పుడు లెక్కలతో మభ్యపెట్టొద్దు

- ఎపి కౌలు రైతుల సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తప్పుడు లెక్కలతో ప్రజలను మభ్యపెట్టొద్దని, 11 నెలల కాలపరిమితితో ఇచ్చే సిసిఆర్‌సి కార్డులను నాలుగేళ్లలో ఇచ్చినవి మొత్తాన్ని కలిపి ఎలా చెబుతారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ప్రశ్నించింది. 2019 నుంచి ఇచ్చిన కార్డులన్నిటినీ కలిపి ప్రచారం చేసుకోవడంలో ప్రభుత్వ ఆంతర్యమేమిటని ప్రశ్నించింది. విజయవాడ బందరు రోడ్డులోని బాలోత్సవ భవన్‌లో శనివారం సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు మీడియాతో మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వం అర్హులైన కౌలుదారులందరికీ సిసిఆర్‌సి కార్డులు ఇవ్వలేకపోయిందన్నారు. 2022-23లో 5.96 లక్షల కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఆచరణలో 5.50 లక్షల కార్డులు మాత్రమే ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. భూమిలేని అర్హత ఉన్న ఒసి కౌలు రైతులకు రౌతు భరోసా ఇవ్వకపోవడం తీవ్రమైన అన్యాయమన్నారు. రైతు ప్రభుత్వంగా వైసిపి చెప్పుకుంటున్నప్పటికీ ఆచరణలో ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తోందన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లో రైతులకు నగదు చెల్లింపులు చేయాల్సి ఉంటే, 60 రోజులు దాటినా చెల్లింపులు జరగని విషయం ప్రజలందరికీ తెలిసిందేనన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం పేరుతో ఇంటి వద్దకు వచ్చే ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు ఏ కుటుంబానికి ఎంత మేలు జరిగిందో కరపత్రాలు ఇస్తున్నారని, అందులో కూడా లబ్ధిదారులకు సంబంధించిన సమాచారం సమగ్రంగా ఉండటం లేదన్నారు.

పెనమలూరు మండలం కానూరులో ఓ రైతుకు రూ.39 వేలు ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందినట్లుగా చూపారని, వాస్తవంగా ఆ లబ్ధిదారునికి రూ.8 వేలు మాత్రమే ప్రభుత్వం ద్వారా చెల్లింపులు జరిగాయన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తే టెక్నికల్ సమస్య అని చెబుతున్నారని పేర్కొన్నారు. గ్రామసభల ద్వారా కౌలు రైతుల గుర్తింపు కార్డులివ్వాలని, కార్డు వచ్చిన ప్రతిఒక్కరికీ రుణాలు, నష్ట పరిహారాలు, పంటల బీమా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇ-క్రాప్ నమోదులో భూ యజమానుల పేర్లు ఉండటంతో కౌలు రైతులు ధాన్యం అమ్ముకోలేకపోతున్నారని, కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకు అదనంగా క్వింటాకు కేరళ ప్రభుత్వం రూ.900, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ.600 అదనంగా ఇస్తున్నాయని తెలిపారు. మీడియా సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టి గోపాల్, రాష్ట్ర సహాయ కార్యదర్శి పంచకర్ల రంగారావు పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్ విస్తరణపై ఉదాసీనత తగదు

- కలెక్టరేట్ ఎదుట ధర్నాలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకూ పొడింపునకు సంబంధించి భూసేకరణకు తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం గుంటూరు కలెక్టరేట్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకట శివరావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పాల్గొని మాట్లాడారు. గుంటూరు ఛానల్ విస్తరణ పట్ల ప్రభుత్వాల ఉదాసీన వైఖరి తగదని అన్నారు. నాలుగు మండలాల పరిధిలో 50 వేల ఎకరాలకు సాగునీరు, 50 గ్రామాలకు తాగునీరు అందించే ఛానల్ విస్తరణకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు మాట్లాడుతూ సుదీర్ఘకాలం నుంచి రైతులు గుంటూరు ఛానల్ పొడిగింపునకు పోరాడుతున్నారని, ఇటీవల భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వం బడ్జెట్‌లో అందుకు అవసరమైన నిధులు కేటాయించకపోవటం సరికాదన్నారు. తక్షణమే భూసేకరణకు నిధులు కేటాయించాలని కోరారు. ధర్నాలో గుంటూరు జిల్లా తెలుగు రైతు నాయకులు కళ్ళం రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ కిసాన్ సెల్ నాయకులు లావు అంకమ్మ చౌదరి, వివిధ సంఘాల నాయకులు కాకుమాను నాగేశ్వరరావు, తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు. ధర్నా అనంతరం జిల్లా సంయుక్త కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

వలసల నివారణకు ప్రత్యేక ప్రణాళిక

- యువగళం సభలో లోకేష్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఖరీఫ్ పంటలు ముగిసిన వెంటనే బెంగళూరు, హైదరాబాదు, గుంటూరు ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని, వలసల నివారణకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసి, స్థానికంగా ఉపాధి దొరికేలా చర్యలు తీసుకుంటామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర శనివారం నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పొలిమేర మెట్ట వద్ద నుంచి ప్రారంభమైంది. యాత్ర మార్గ మధ్యలో పలు గ్రామాల ప్రజలు, దళితులు, ఎన్‌టిఆర్ హౌసింగ్ లబ్ధిదారులతో మాట్లాడారు. టిడిపి అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. తుగ్గలి మండలం రాంపల్లి సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడారు. దళితులను తాను అవమానించినట్లు వైసిపి ఓ ఫేక్ వీడియో విడుదల చేసిందని తెలిపారు. కోడికత్తి కేసులో జగన్ డ్రామా తప్ప నిజం లేదని ఎన్ఐఎ తేల్చేసిందన్నారు. త్వరలోనే వలంటీర్ మీ ఇంటికి వస్తారని, మీరు పీల్చే గాలిపై కూడా పన్నేస్తారని విమర్శించారు. 100 సంక్షేమ కార్యక్రమాలు రద్దు చేసిన మొదటి సిఎం జగన్మోహన్‌రెడ్డినే అని మండిపడ్డారు. విశాఖ, అనంతపురం, గుంటూరులో మూసివేసిన స్టడీ సర్కిల్స్‌ను తిరిగి ప్రారంభించడంతో పాటు అన్ని జిల్లాల్లో స్టడీ సర్కిల్స్‌ను ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. బిసిలకు శాశ్వత కుల ధ్రువ పత్రాలు అందిస్తామని తెలిపారు. మాజీ మంత్రి కెఇ.ప్రభాకర్, కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి, భూమా అఖిల ప్రియ, ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటపతి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కర్నూలు జిల్లా తుగ్గలి మండలం శభార్‌పురంలో లోకేష్ పాదయాత్రను దళితులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఎస్‌సిలను కించపరిచేలా లోకేష్ మాట్లాడారని క్షమాపణ చెప్పాలని దళిత సంఘాల నాయకులు, ఎస్‌సిలు ఊరేగింపుగా రాగా పోలీసులు అడ్డుకుని వారందరినీ వెనక్కు పంపారు.


రాంపలి సర్కిల్ వద్ద బహిరంగ సభలో మాట్లాడుతున్న లోకేష్



హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌కు రూ.12,047 కోట్ల లాభాలు

న్యూఢిల్లీ : ప్రయివేటు రంగంలోని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ 2023 మార్చితో ముగిసిన త్రైమాసికంలో 19.8 శాతం వృద్ధితో రూ.12,047 కోట్ల నికర లాభాలు సాధించింది. రుణాల జారీలో మెరుగైన వృద్ధి వల్లే అధిక లాభాలను ఆర్జించింది. బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం ఏకంగా 23.7 శాతం పెరిగి రూ.23,351.8 కోట్లకు చేరింది. గతేడాది ఇదే మార్చి త్రైమాసికంలో రూ.7637.1 కోట్లుగా ఉన్న ఇతర ఆదాయం.. క్రితం త్రైమాసికంలో రూ.8731.2 కోట్లకు చేరింది. 2023 ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 1.23 శాతం నుంచి 1.12 శాతానికి తగ్గాయి. బ్యాంక్ మొత్తం బ్యాలెన్స్ షీట్ 19.2 శాతం పెరిగి రూ.24.6 లక్షల కోట్లకు చేరింది.

విత్త రంగం ఒత్తిడితో వృద్ధికి విఘాతం

- ఐఎంఎఫ్ విశ్లేషణ



వాషింగ్టన్ : ప్రపంచ విత్త రంగంలో ఒత్తిడి నెలకొందని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) పేర్కొంది. దీంతో వృద్ధి రేటుపై ప్రతికూల ప్రభావం పడుతోందని విశ్లేషించింది. ఇటీవల కాలంలో అమెరికా, స్విజ్జర్లాండ్‌లోని ఫైనాన్సీయల్ సెక్టార్‌లో చోటు చేసుకున్న సంక్షోభాల వల్ల ప్రపంచ దేశాల జిడిపి మందగించిందని పేర్కొంది. ఇకపై రుణాలు ఇవ్వడంలో బ్యాంకులు మరింత వివేకంగా ఉండొచ్చని ఐఎంఎఫ్ విశ్లేషించింది. “ఒపెక్ దేశాలు ఒక ప్రణాళికగా చమురు ఉత్పత్తి కోతలకు దిగడం వల్ల ఇప్పటికే అధిక ధరలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో వినియోగదారుల వద్ద ఇతర ఖర్చులకు తక్కువగా నగదు ఉంటుంది. ఈ పరిణామం మాంద్యం ప్రమాదాలను మరింత పెంచుతుంది. ధరల ఒత్తిడి మరింత పెరుగొచ్చు.” అని ఐఎంఎఫ్ పేర్కొంది. ఐఎంఎఫ్ అంచనా ప్రకారం.. 2023లో ప్రపంచ వృద్ధి రేటు 2.8 శాతానికి కుంచించుకుపోవచ్చు. గతేడాది ఇది 3.4 శాతంగా నమోదు కాగా.. వచ్చే ఏడాది 3 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వ్యవస్థలు ఎక్కువగా ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో భారత వృద్ధి రేటు 5.9 శాతానికే పరిమితం కావొచ్చని ఇటీవల ఐఎంఎఫ్ ఓ రిపోర్టులో పేర్కొంది. 2022-23లో 6.8 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. దీంతో పోల్చితే భారీ తగ్గుదలనే చోటు చేసుకోనుంది. మరోవైపు 2023-24లో భారత వృద్ధి రేటు 6.3 శాతంగా ఉండొచ్చని ఇటీవల ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది.

బిజెపి, వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

బిజెపి, వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ విమర్శించారు. పెండింగ్ ప్రాజెక్టుల సాధన కోసం శనివారం తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలోని రాజీవ్‌గాంధీ విగ్రహం ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యాన ధర్నా జరిగింది. ఈ సందర్భంగా చింతామోహన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధిలో తిరుపతి జిల్లా ముందంజలో ఉండేదన్నారు. దాదాపు రూ.లక్ష కోట్ల గ్రాంట్లు జిల్లాకు తెచ్చామన్నారు. మన్నవరం భెల్ ఫ్యాక్టరీ, దుగరాజపట్నం ఓడరేవు, శ్రీసిటీలను తీసుకొచ్చామని వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి వల్ల మన్నవరం భెల్ ఫ్యాక్టరీ, దుగరాజపట్నం ఓడరేవు నిర్మాణం పనులు ఆగిపోయాయన్నారు. శ్రీకాళహస్తి - నడికుడి రైల్వే లైన్ పనులు నేటికి పూర్తి కాలేదని విమర్శించారు. రైలు ఇంజన్ మార్చి, పాత బోగీలకు కొత్త రంగులు వేసి వందేభారత్ అని పేరు పెట్టి ప్రారంభించడం హాస్యాస్పదమన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి యార్లపల్లి గోపిగౌడ్, తిరుపతి జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షులు రవి, తేజోవతి, శాంతియాదవ్, జావేద్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

శ్రీ పద్మావతి వైద్య కళాశాలలో.. రూ.53.62 కోట్లతో అభివృద్ధి పనులు

- టిటిడి విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుల నియామకం
- టిటిడి ధర్మకర్తల మండలి అధ్యక్షులు వెల్లడి
- ఎక్స్-అఫీషియో సభ్యుడిగా సత్యనారాయణ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - తిరుమల

తిరుపతిలోని స్విమ్స్ పరిధిలో గల శ్రీ పద్మావతి మహిళా వైద్యకళాశాలలో టిబి, చెస్ట్, స్కిన్ ఇతర ఐసోలేషన్ వార్డులు, స్టాఫ్ క్వార్టర్లు, హాస్టళ్ల నిర్మాణ పనుల కోసం రూ.53.62 కోట్లు మంజూరు చేసినట్టు టిటిడి ధర్మకర్తల మండలి అధ్యక్షులు వైవి.సుబ్బారెడ్డి తెలిపారు. టిటిడి ధర్మకర్తల మండలి సమావేశం తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం జరిగింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను చైర్మన్ మీడియాకు వెల్లడించారు. టిటిడి అవసరాలకుగాను ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన 12 రకాల ఉత్పత్తుల కొనుగోలుకు ధరల నిర్ణయంపై రైతు సాధికార సంస్థ, మార్క్‌ఫెడ్‌తో చర్చించేందుకు టిటిడి బోర్డు సభ్యులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సనత్ కుమార్, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డితో కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలిపిరి మార్కెటింగ్ గొడౌన్ వద్ద నూతన గొడౌన్ల నిర్మాణానికి రూ.18 కోట్లు, కోల్డ్ స్టోరేజి నిర్మాణానికి రూ.14 కోట్లు కేటాయించామన్నారు. తిరుపతిలోని తాతయ్య గుంట గంగమ్మ ఆలయ ఆధునీకరణ పనులకు రూ.3.12 కోట్లతో టెండరుకు ఆమోదం తెలిపినట్టు వెల్లడించారు. శ్రీనివాస సేతు పనులను త్వరితగతిన పూర్తి చేసి జూన్ 15 నాటికి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఎఫ్‌సిఆర్‌ఎ (విదేశీ విరాళాల స్వీకరణ చట్టం) ప్రకారం విదేశీ భక్తుల నుండి విరాళాలు స్వీకరించడానికి టిటిడికి అనుమతి ఉందని, ఈ అనుమతి 2020 జనవరికి ముగిసిందని, దీనిని రెన్యువల్ చేసుకోవడానికి టిటిడి దరఖాస్తు చేసిందని తెలిపారు. ఎఫ్‌సిఆర్‌ఎ, రాష్ట్ర దేవాదాయ శాఖ చట్టాల మధ్య ఉన్న సాంకేతిక కారణాల వల్ల విరాళాల డిపాజిట్లపై వచ్చే వడ్డీని చూపడంలో కొన్ని అభ్యంతరాలు తెలిపారు. ఇది సాంకేతిక కారణం మాత్రమేనని, ఎఫ్‌సిఆర్‌ఎ అధికారుల సూచన మేరకు త్వరగా లైసెన్స్ రెన్యువల్ చేసుకోవ డానికి రూ.3 కోట్లు చెల్లించడం జరిగిందని, చెల్లించిన సొమ్మును తిరిగి పొందడానికి కషి చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో టిటిడి ఇఒ ఎవి.ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు భూమన కరుణాకర్‌రెడ్డి, పోకల అశోక్ కుమార్, కాటసాని రాంభూపాల్ రెడ్డి, జెఇఒలు సదా భార్గవి, వీరబ్రహ్మం, నరసింహ కిషోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిటిడి ధర్మకర్తల మండలి ఎక్స్ అఫీషియో సభ్యునిగా దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. టిటిడి జెఇఒ వీరబ్రహ్మం ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు.

బజాజ్ ఆటో, ట్రయంప్ మోటార్స్ భాగస్వామ్యం

పూణె : భారత్‌లో తన అమ్మకాలు, మార్కెటింగ్ కార్యకలాపాలను బజాజ్ ఆటోకు బదిలీ చేస్తూ ట్రయంఫ్ మోటార్ సైకిల్స్ లిమిటెడ్ నిర్ణయం తీసుకుంది. నూతన శ్రేణి మిడ్-సైజ్ ట్రయంప్ మోటార్ సైకిళ్లను సృష్టించడానికి ఇరు సంస్థలు పరస్పర భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ప్రస్తుతం ట్రయంఫ్ మోటార్ సైకిల్ సంస్థకు ఉన్న 15 డీలర్‌షిప్‌లను ఇకపై బజాజ్ ఆటో నిర్వహించనున్నట్లు పేర్కొంది. వచ్చే రెండేళ్లలో 120కి పైగా నగరాల్లో ట్రయంఫ్ డీలర్‌షిప్‌లను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని బజాజ్ ఆటో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాకేష్ శర్మ పేర్కొన్నారు.

ఎస్‌బిఐ ‘అమృత్ కలశ్’ ప్లాన్ పున:ప్రారంభం

న్యూఢిల్లీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పెషల్ డిపాజిట్ పథకమైన అమృత్ కలశ్ పథకాన్ని మళ్లీ ప్రారంభించింది. 400 రోజుల గడువు కలిగిన ఈ ఎఫ్‌డి ప్లాన్‌లో అధిక వడ్డీ రేటును అందిస్తున్నట్లు తెలిపింది. ఏప్రిల్ 12 నుంచి మళ్లీ అందుబాటులోకి తెచ్చిన ఈ ప్లాన్‌లో డిపాజిట్లపై 7.10 శాతం వడ్డీ రేటును కల్పిస్తున్నట్లు పేర్కొంది. 2023 ఫిబ్రవరి 15న ఈ ప్లాన్‌ను ఆవిష్కరించగా.. 2023 మార్చి 31 వరకు అందుబాటులో ఉంది. తాజా నిర్ణయంతో గడువు పెంచినట్లయ్యింది. ఈ ప్లాన్‌లో సీనియర్ సిటిజన్లకు గరిష్టంగా 7.6 శాతం వడ్డీ అందిస్తుంది. అమృత్ కలశ్ ప్లాన్ వచ్చే జూన్ 30 వరకు అందుబాటులో ఉంటుందని ఎస్‌బిఐ తెలిపింది.

ఏడాది పూర్తి చేసుకున్న ఎం.స్టాక్

హైదరాబాద్ : అంతర్జాతీయ ఆర్థిక సేవల గ్రూప్ మిరే ఎసెట్ తమ ఆన్‌లైన్ రిటైల్ స్టాక్ బ్రోకింగ్ ప్లాట్‌ఫాం ఎం.స్టాక్ విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకున్నట్లు తెలిపింది. ఈ క్రమంలో 1.8 లక్షల మంది పెయిడ్ యూజర్లను సంపాదించినట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ఒకేసారి రూ.999 ఫీజుతో లభించే ‘జీరో బ్రోకరేజ్ ఇన్ ప్రొడక్ట్స్ ఫర్ లైఫ్’ ధర ఎం.స్టాక్ వద్ధికి దోహదం చేసిందని తెలిపింది. యాక్టివ్ క్లయింట్ నిష్పత్తి 71 శాతం, 8.5 కోట్లకు పైగా ట్రేడ్లు, ఒక సంవత్సరంలో 71 లక్షలకు పైగా యాప్ డౌన్‌లోడ్‌లతో ఎం.స్టాక్‌కు పెరుగుతున్న ప్రజాదరణను గుర్తించవచ్చని పేర్కొంది.

సమిష్టిగా పనిచేద్దాం

- జనసేన కార్యకర్తలకు నాగబాబు పిలుపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజా ప్రయోజనాల కోసం అంకిత భావంతో సమిష్టిగా కలిసి పనిచేసి, జనసేన పార్టీని 2024లో అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేద్దామని పార్టీ కార్యకర్తలకు ప్రధాన కార్యదర్శి కె నాగబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాలూ పర్యటించి కార్యకర్తలు, వీర మహిళలు, నాయకులతో మమేకమై జనసేన సిద్ధాంతాలు ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. తమపై నమ్మకం ఉంచి పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చినందుకు పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుజు మోటార్స్ ఉత్పత్తి ఆధునీకరణ

చెన్నయ్ : బిఎస్6 రెండవ దశ ప్రమాణాల కోసం తమ ఉత్పత్తి శ్రేణిని ఆధునీకరించినట్లు ఇసుజు మోటార్స్ ఇండియా వెల్లడించింది. ఇది తమ పికప్, ఎస్‌యువిల ఉద్గార ప్రమాణాలను నిర్ధారిస్తుందని పేర్కొంది. ఇసుజు డి-మ్యాక్స్ వి-క్రాస్ జడ్ ఉత్పత్తి పోర్ట్‌ఫోలియోను సమూలంగా ఆధునీకరించడంతో పాటుగా ఎంపిక చేసిన మోడల్స్‌కు నూతన ఫీచర్లను జోడించినట్లు తెలిపింది.



సంపాదకీయం

సంస్కృతీ వికాసం

మానవజాతి ప్రగతికి ప్రతిబింబం...సంస్కృతి. విభిన్న మతాలు, కులాలు, భాషలు, జీవన విధానాలు, కట్టు, బొట్టు, ఆహార వ్యవహారాలలో కూడిన భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రదర్శిస్తున్న భారతీయ సంస్కృతి గొప్పది. దేశంలోని భిన్న సంస్కృతులకు కేంద్రంగా, జీవన వైవిధ్యానికి వేదికగా సాంస్కృతిక జీవన విధానంగా...దండలో దారంలా కొనసాగుతున్నది. ఏ దేశ సంస్కృతి అయినా/ ఏనాడూ కాదొక స్థిర బిందువు' అంటాడు తిలక్. వ్యవస్థ పునాదులను పటిష్ట పరచడానికి, దాని ఆధారంగా నూతన వ్యవస్థను రూపకల్పన చేసి భావితరాలకు అందించడానికి నిరంతరంగా సాగే ప్రక్రియ...సంస్కృతి. ఇది ఏదేని సమాజంలోని ప్రజల జీవనశైలికి అద్దం పడుతుంది. ఇది మానవాళికి వున్న అమూల్యమైన, విశిష్టమైన సంపద. ప్రతి ప్రాంతానికీ, ప్రతి దేశానికీ వాటికంటూ విశిష్ట లక్షణాలతో కూడిన సంస్కృతి వుంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే...ఒక జాతి జీవన విధానమే సంస్కృతి. సమాజంలో జరిగే సాంప్రదాయిక భావ ప్రసరణ అనేది సంస్కృతికి సంబంధించిన ప్రధానమైన అంశం. అదేవిధంగా... మనం అనుసరిస్తున్న ఆచార వ్యవహారాలు, పండుగలు, కళలు, సాహిత్యం, సంగీతం, శిల్పకళ, మతం, శాస్త్రీయ విజ్ఞానం, జీవనశైలి, జీవితానికి సంబంధించిన సామాజిక దృక్పథం కూడా ఇందులో భాగమే. ఒక జాతి సంస్కృతి అనువంశికంగా సాగుతుంటుంది. దీనినే వారసత్వం అంటారు. 'భారతీయ సాంస్కృతిక వారసత్వం అనేది దేశంలో నిలదొక్కుకోవడానికి వచ్చిన విభిన్న సంస్కృతుల మేళవింపు' అంటారు గాంధీజీ. భారతీయ సంస్కృతి వైవిధ్యభరితమైనది. విభిన్న సంస్కృతుల సంశ్లేషణం. భిన్నత్వంలో ఏకత్వం దీని ప్రధాన లక్షణం. కాల గమనంలో ఎలాంటి ప్రభావాలకు లొంగకుండా... తొణకకుండా నిరంతరాయంగా కొనసాగుతుంటుంది.

సంస్కృతికి అర్థం విస్తృతమైనది... సమగ్రమైనది. ఒక లెక్క ప్రకారం...దీనికి రెండు వందల నిర్వచనాలు వున్నాయి. 'ప్రపంచంలో రెండు విభిన్న సంస్కృతులు వున్నాయి. ఒకటి సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ సంస్కృతి, రెండోది సోషలిస్టు సంస్కృతి' అంటారు మక్సీం గోర్కీ. 'పెట్టుబడిదారీ వ్యవస్థలో సంస్కృతి అంతర్జాతీయ సరుకుగా మారిపోయింది' అంటారు జయతీ ఘోష్. 'హిందూ దేశ ఏర్పాటుకు సంబంధించిన మతతత్వ పథకానికి అనుగుణంగా సుసంపన్న సంస్కృతి వైవిధ్యాన్ని మతతత్వం హైజాక్ చేస్తున్నది. దానితోపాటుగా చరిత్రను కుదించి వక్రీకరిస్తున్నారు' అంటారు ప్రొఫెసర్ ఫణిక్కర్. దేశంలోని కీలకమైన సాంస్కృతిక, మేధో సంస్థలన్నిటినీ కరుడుగట్టిన ఆర్ఎస్ఎస్ వాదులతో నింపుతూ... ప్రస్తుత పాలకులు దేశాన్ని మతోన్మాదం వైపునకు నడిపిస్తున్నారు. ఆహారం, ఆహార్యం, భాష...అన్నిటిపైనా ఆంక్షలు, వక్రీకరణలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. చారిత్రక ఆనవాళ్లను చెరిపేస్తూ...అసలైన భారతీయ సంస్కృతికి, సాంస్కృతిక వికాసానికి కొత్త అర్థాలను చెబుతున్నారు. 'కాశ్మీర్ ఫైల్స్' వంటి సినిమాలే దీనికి ఉదాహరణ. సంస్కృతిని సరుకుగా మార్చుతూ...సామ్రాజ్యవాదానికి మతం తోడైతే ఎంత ప్రమాదమో సంఘ్‌పరివార్ రుజువు చేస్తోంది. ఒక దేశం, ఒక మతం, ఒకే సంస్కృతి వంటి తప్పుడు సూత్రీకరణలు చేస్తున్నారు. మన దేశంలో సంస్కృతి అంటే-'కులం లేదా వర్ణాశ్రమ ధర్మాలే' అనే ప్రచారం బాగా జరుగుతోంది. స్థూలంగా చెప్పాలంటే...మన జీవన విధానంలోని తినే తిండి దగ్గర నుంచి మాట్లాడే భాష, వేసుకునే బట్టలు, పాడే పాటలు, ఆడే ఆటలు, మన ఉత్పత్తి విధానం వరకూ సంస్కృతిలో భాగమే. బహుళ భాషలు, అనేక జాతులున్న సమాజంలో ఒక్కటే సంస్కృతి ఎన్నటికీ వుండదు. ఇక్కడ భిన్నజాతులు, విభిన్న సంస్కృతులు ఎప్పుడూ వుంటాయి. అవి కలిసిమెలిసి వుండాలి.

సంస్కృతికి బాహ్యరూపం నాగరికత. దీనికి మూలం- భూమి, శ్రమ. శ్రమపై ఆధారపడిన సాంస్కృతిక విశేషాలను, దేశీయమైన సామాజిక విశిష్టతలను, విభిన్న కులాలు, మాతాల సాంస్కృతిక వారసత్వాన్ని పదిలంగా కాపాడుకోవాలి. సంస్కృతీ వికాసంలో ఇది కీలకమైనది. మన సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా వుంది. 'మతం వేరైతేను యేమోయి?/ మనసులొకటై మనుషులుంటే' అనే గురజాడ లౌకిక భావజాల స్ఫూర్తిని దేశమంతా నినదించాలి.

మహనీయుల మాట




నువ్వు మనస్ఫూర్తిగా నవ్వాలంటే...
ముందు నీ బాధతో నువ్వు ఆడుకోవాలి.
- చార్లీ చాప్లిన్

Charlie Chaplin

విశాఖ ఉక్కుతో కేంద్రం పరిహాసం

ప్రస్తుతం





తెలకపల్లి రవి

ఈ వారం మొత్తం తెలుగు రాష్ట్రాలను రెండు వివాదాలు కుదిపేశాయి. అందులో ఒకటి పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను అడ్డుకోవడం. రెండవది ఇరు రాష్ట్రాల ప్రభుత్వాధినేతలు లేదా పాలక పార్టీలూ మొదలెట్టిన వృథా వివాదాన్ని ఆపడం. ఇందులో మొదటిది ఇరు రాష్ట్రాల సుహృద్భావానికి, ఉమ్మడి వారసత్వానికి ప్రతీకగా నిలిస్తే రెండవది రాజకీయ పార్టీల సంకుచితత్వానికి అవాంఛనీయ వ్యూహాలకు అద్దం పట్టింది. వాస్తవానికి మొదటి సమస్యపై కూడా రెండో సమస్య తరహాలోనే స్పందనలు రాకపోలేదు. కాని ఇరు రాష్ట్రాలకు శూన్యహస్తమే చూపిస్తున్న మోడీ ప్రభుత్వం విశాఖ ఉక్కు విషయంలోనూ క్రూర పరిహాసమే చేసింది. ఈ స్వల్ప వ్యవధిలోనే ఇరు రాష్ట్రాలనూ పాలిస్తున్న గతంలో పాలించిన పెద్ద పార్టీలకు మర్చిపోలేని పాఠాలు నేర్పించి తన ఆధిక్యతనూ ఏకపక్ష బాధ్యతా రాహిత్యాన్ని తనే వెల్లడించుకుంది.

> ఈ దశలో సందర్శనకు వచ్చిన కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగన్ సింగ్ కులస్తే...తాము ఇప్పుడు ప్రైవేటీకరణ కోసం గాక నిర్వహణ సామర్థ్యం పెంచే పెట్టుబడి కోసమే ప్రయత్నిస్తున్నామని సన్నాయి నొక్కులు నొక్కారు. దీన్నిబట్టి తమ వల్లనే కేంద్రం వెనక్కు తగ్గిందని, ఇది తెలంగాణ దెబ్బ అని కెటిఆర్‌తో సహా బిఆర్ఎస్ నాయకులు నిన్న మధ్యాహ్నానికి హడావుడి మొదలెట్టారు. ఉక్కు ఫ్యాక్టరీ కార్మిక సంఘాలు అంతగా తొందరపడకపోగా సాయంత్రం సమావేశంలో అదే కేంద్ర మంత్రిని స్పష్టత కోసం నిలదీశారు. దాంతో తానేమీ చెప్పలేనని ఆయన గొంతు మార్చారు. ప్రజాశక్తిలో నిన్న ఉదయమే కేంద్రం వంచన అంటూ పతాక శీర్షిక వచ్చింది. దాంతో సూటిగా తాము ప్రైవేటీకరణకే కట్టుబడి వున్నట్టు కేంద్రం మొండి వైఖరిని పునరుద్ఘాటించింది.

ఆగిన గత ప్రయత్నాలు

2021 అక్టోబరు ప్రాంతంలో కేంద్రం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ లేదా రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్‌ను వంద శాతం ప్రైవేటీకరించాలని నిర్ణయించింది. దీన్ని ఎవరికి ఎంతకు కట్టబెడతారనే దానిపైనా చాలా కథనాలు వచ్చాయి. ఇప్పుడు పూర్తిగా భ్రష్టుపట్టిన అదానీ సామ్రాజ్యంలో ఉక్కు ఫ్యాక్టరీని కలిపేస్తారనే వార్తలు వచ్చాయి. ఇంకా దక్షిణ కొరియా కంపెనీ పోస్కో, టాటా వంటి పేర్లన్నీ కూడా వినిపించాయి. 1966లో తెలుగు ప్రజల పోరాటాలు, కమ్యూనిస్టు ఎంఎల్ఎల రాజీనామాలు, యువత ప్రాణార్పణలతో ఆవిర్భవించింది. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనేది నాడు మార్మోగిన నినాదం. ఇందుకోసం తాము కూడా పోరాడామని తెలంగాణ ప్రభుత్వం అంటున్న మాట కూడా నిజమే. దానికి భూమిని సమకూర్చడం కోసం వేలమంది నిర్వాసితులయ్యారు. ఇప్పటికీ వారిలో అనేకులకు సరైన పరిహారం దొరికింది లేదు. ఆ ఫ్యాక్టరీని ప్రారంభించడానికి చాలాకాలం పట్టినా ప్రజలు ఓపికగా నిరీక్షించారు. దాన్ని జయప్రదంగా నడిపించడంలో కార్మిక వర్గం ముఖ్య పాత్ర వహించింది. అనేక త్యాగాలు చేసింది. అనతి కాలంలోనే విశాఖ ఉక్కు ప్రపంచ చిత్ర పటంలో చోటు సంపాదించగలిగింది. పెట్టిన పెట్టుబడికి మించి లాభాలు అందించింది. అయితే దాని పురోగమనానికి చేయి కలపకపోగా కేంద్రం సైంధవ పాత్ర పోషించింది. సుదీర్ఘ సముద్ర తీరం, నిపుణులైన కార్మిక ఉద్యోగ అధికార బృందంతో మంచి విజయాలు సాధించే ఈ ఫ్యాక్టరీకి ఇనుప గనులు కేటాయించకుండా తొండి చేసింది. దశాబ్దాల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతున్నా రాష్ట్రంలో పాలక పార్టీలేవీ కేంద్రంలో తాము వున్నప్పుడు కూడా మార్పు తెచ్చింది లేదు. పైగా ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ సంకేతాలివ్వడం, కార్మిక సంఘాల నిరసనతో వెనక్కు తగ్గడం జరుగుతూ వచ్చింది. విస్తరణకు నిధులివ్వకపోగా ఉత్పత్తిని కుదించడం, కావాలని నష్టాల పాలు చేయడం వాటి వ్యూహంగా అర్థమైంది. సరళీకరణతో ఈ ధోరణి మరింత ముదిరింది. అయినా కార్మిక సంఘాల ఐక్య ప్రతిఘటన కారణంగా కేంద్రం ఆ పని చేయలేకపోయింది. ఇందుకు అనేక ఉదాహరణలున్నాయి.

మోడీ సర్కారు ఏకపక్ష దాడి

నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక పెట్టుబడుల ఉపసంహరణ అనే ప్రక్రియను పెద్ద ఆర్భాటంగా సాగించడం, అదానీ వంటి ఆశ్రిత పెట్టుబడిదారులకు కట్టబెట్టడం నిత్యకృత్యమైంది. అయినా మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడే విశాఖకు ఎసరుపెట్టే చర్యలు తీసుకున్న కేంద్రం మలి దఫా గద్దెక్కాక నేరుగా దాడి తీవ్రం చేసింది. వంద శాతం ప్రైవేటీకరణ చేయనున్నట్టు కేంద్రం అధికారికంగా ప్రకటించింది. వాజ్‌పేయి హయాంలోనే ఇలాంటి ప్రతిపాదన వస్తే తాము అడ్డుకున్నామని చంద్రబాబు నాయుడు తరచూ చెబుతుంటారు. కానీ మోడీ ప్రభుత్వంలో దీర్ఘకాలం పాటు భాగస్వామిగా వున్న ఆ పార్టీ నేతలు ఈ విషయమై సంకేతాలు వస్తున్నా నిరోధించే తీవ్ర ప్రయత్నమేదీ చేయలేదు. ఇప్పుడున్న వైసిపి జగన్ ప్రభుత్వం కూడా ముందస్తుగా అడ్డుకోకపోగా ప్రకటన వచ్చాక కూడా నీళ్లు నములుతూ కూర్చుంది. ప్రైవేటీకరణ తరహాలో వాటాలు విడుదల చేయాలని, భూములు అమ్మి అప్పులు కట్టాలనీ ముఖ్యమంత్రి మొదట్లోనే విడ్డూరమైన ప్రతిపాదనలతో లేఖ రాశారు. మరోవైపున కార్మిక సంఘాలు, వామపక్షాలు నిశితంగా వ్యతిరేకించడమే గాక సమరశీల పోరాటం మొదలెట్టాయి. ఆ దశలో విశాఖ వచ్చిన ముఖ్యమంత్రి తాము గట్టిగా మాట్లాడతామంటూ వారితో నమ్మబలికారు గాని ఆ దిశలో జరిగింది శూన్యం. టిడిపి, వైసిపి ఒకరినొకరు విమర్శించుకోవడమే తప్ప కేంద్రంపై ఏకోన్ముఖ పోరాటానికి సిద్ధం కాలేదు. బిజెపి ఎ.పి నాయకులు రకరకాల మాటలతో గందరగోళం పెంచడమేగాక ప్రైవేటీకరణ వల్ల ఉద్యోగాలకేమీ ముప్పు రాదని సమర్థన ఎత్తుకున్నారు. రామతీర్థం వంటి మతపరమైన అంశాలతో దృష్టి మళ్లించే ప్రయత్నం చేశారు. బిజెపి మిత్రపక్షమైన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కేంద్రంతో మాట్లాడుతున్నానంటూనే రాష్ట్రానిదే తప్పని వింత వాదన తెచ్చారు. అఖిల పక్షాన్ని తీసుకువెళ్లడానికి జగన్ సిద్ధం కాకపోవడం వల్లనే ఇదంతా జరిగిందన్నారు. ఈ విధంగా మూడు పార్టీలు అవకాశవాద రాజకీయాలు అనుసరించడం బిజెపికి కొమ్ములు తెచ్చింది. కార్మిక సంఘాలు మాత్రం ఎవరి విధానం ఎలా వున్నా అందరినీ కలుపుకొని లక్ష్యం సాధించడమే తమ మార్గమంటూ అందరికీ సహకారం అందించారు. మరో వంకన ఫ్యాక్టరీ స్థాపనకు దారితీసిన పరిస్థితులు మొదటి నుంచి కేంద్రం సాగించిన నయవంచన, లెక్కల టక్కుటమారం బహిర్గతం చేయడం ద్వారా గొప్ప సైద్ధాంతిక పోరాటం కూడా చేశాయి. స్వంత ప్రత్యేక గనులు (క్యాప్టివ్ మైన్స్) కేటాయించకపోవడం వెనక గల దుష్ట తంత్రం ఏమిటో, నష్టాలు ఎందుకు వచ్చాయో తెలియజెప్పాయి. ఈ చర్చ మొదలైన తర్వాత కూడా జరిగిన గనుల కేటాయింపు సమయంలో ఒరిస్సా లోని గనుల కోసం ఒత్తిడి తెచ్చాయి. విశాఖ యాజమాన్యం కూడా వేలంపాటలో పాల్గొంది. కాని కేంద్రం కావాలని ప్రైవేటు కంపెనీలకే ప్రాధాన్యతనిచ్చింది. విశాఖ ఉక్కు అభ్యర్థనను పట్టించుకోలేదు.

మోడీ మొండి చేయి!

కార్మిక సంఘాల పోరాటం తీవ్రమైన కొద్దీ తమ నిర్ణయంలో మార్పు లేదని చెప్పడం పనిగా పెట్టుకుంది. ఇందుకోసం లీగల్, అసెస్‌మెంట్, బిడ్డింగ్ కమిటీలను ఏర్పాటు చేసింది. మొదట్లో అదానీ, టాటా, దక్షిణ కొరియాకు చెందిన పోస్కో వంటి కంపెనీలు తీసుకోవచ్చనే కథలు వినిపించాయి. వ్యూహాత్మకంగానే టాటాల పేరు తెచ్చినట్టు కూడా చెప్పారు. కొద్ది మాసాల కిందట ప్రధాని మోడీ విశాఖ వచ్చినప్పుడు పాల్గొన్న బహిరంగసభ వేదికపై ముఖ్యమంత్రి జగన్ మొక్కుబడిగా విశాఖ ఉక్కు ప్రస్తావన తెచ్చారే గాని గట్టిగా మాట్లాడింది లేదు. ఆయన స్పందన అంతకన్నా లేదు. అప్పుడే ప్రధానితో స్వల్ప సమావేశం జరిపిన పవన్ కళ్యాణ్ కూడా మంచిరోజులు వస్తాయని చెప్పడం తప్ప దీనిపై సాధించింది లేదు. కాకపోతే ఈ లోగా అదానీ బండారం బయటపడిపోయింది. ఎన్నికలు దగ్గరకు వస్తున్నాయి గనక కొంతకాలం కొత్త ఎత్తులతో కాలక్షేపం చేయొచ్చని బిజెపి వర్గాలు వెల్లడించాయి.

బిడ్ల ప్రహసనం, గడువు పెంపు

మొదటి నుంచి ఈ ప్రైవేటీకరణను గట్టిగా వ్యతిరేకిస్తున్న కెసిఆర్ ఈ దశలో రంగంలోకి దిగి అమ్మకమే జరిగేట్టయితే తాము కూడా వేలంలో పాల్గొని కొనుగోలు చేస్తామనడంతో కొత్త వివాదం మొదలైంది. తెలంగాణ సర్కారు చూపిన పాటి తెగువ కూడా జగన్ ఎందుకు చూపడం లేదనే ప్రశ్న వచ్చింది. అత్యుత్సాహవంతులైన వైసిపి మంత్రులు బిఆర్ఎస్‌పై దాడి చేసేవరకూ వెళ్లారు. అయితే అక్కడ అమ్మకమే లేదని ఆసక్తి వ్యక్తీకరణ పేరిట వర్కింగ్ పెట్టుబడిని మాత్రమే ఆహ్వానిస్తున్నారని ఎ.పి సర్కారు సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సమర్థించారు. తాము విశాఖ ఉక్కు కొనుగోలు చేయడం కోసమనిగాక అక్కడ పరిస్థితిని, అవకాశాలను అధ్యయనం చేయడం కోసం అధికారుల బృందాన్ని పంపుతామని కెటిఆర్ ప్రకటించారు. ఇది విశాఖ ఉక్కుపై జగన్ ప్రభుత్వ స్పందనా రాహిత్యానికి సవాలేనని అందరూ భావించారు. కార్మిక సంఘాలూ ఆహ్వానించాయి. ఈ దశలో సందర్శనకు వచ్చిన కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగన్ సింగ్ కులస్తే తాము ఇప్పుడు ప్రైవేటీకరణ కోసం గాక నిర్వహణ సామర్థ్యం పెంచే పెట్టుబడి కోసమే ప్రయత్నిస్తున్నామని సన్నాయి నొక్కులు నొక్కారు. దీన్నిబట్టి తమవల్లనే కేంద్రం వెనక్కు తగ్గిందని, ఇది తెలంగాణ దెబ్బ అని కెటిఆర్‌తో సహా బిఆర్ఎస్ నాయకులు నిన్న మధ్యాహ్నానికి హడావుడి మొదలెట్టారు. ఉక్కు ఫ్యాక్టరీ కార్మిక సంఘాలు అంతగా తొందరపడకపోగా సాయంత్రం సమావేశంలో అదే కేంద్ర మంత్రిని స్పష్టత కోసం నిలదీశారు. దాంతో తానేమీ చెప్పలేనని ఆయన గొంతు మార్చారు. ప్రజాశక్తిలో నిన్న ఉదయమే కేంద్రం వంచన అంటూ పతాక శీర్షిక వచ్చింది. దాంతో సూటిగా తాము ప్రైవేటీకరణకే కట్టుబడి వున్నట్టు కేంద్రం మొండి వైఖరిని పునరుద్ఘాటించింది. దాంతో ఒక ప్రహసనం ముగిసింది. ఈ రోజు తెలంగాణ లేదా సింగరేణి తరపున బిడ్ దాఖలు కాలేదని సమాచారం. ఆ గడువును మరో ఐదు రోజులు పొడగించినట్టు చెబుతున్నారు. విశాఖ నుంచి మళ్లీ లోక్‌సభకు పోటీ చేస్తానని ప్రకటించిన సిబిఐ మాజీ జె.డి లక్ష్మీనారాయణ కూడా బిడ్ వేసి క్లౌడ్‌ఫండింగ్‌తో ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకోవచ్చని చెబుతున్నారు. ఇవేవీ కూడా సమస్యకు అసలైన పరిష్కారాలు కావు. రెండు రాష్ట్రాల ప్రభుత్వాల చొరవతో మరో సమైక్య ఉద్యమం జరిపి దాన్ని ప్రభుత్వరంగంలోనే కొనసాగించేలా కేంద్రం మెడ వంచాల్సిందే. అందుకు భిన్నంగా ఎ.పి ప్రాంతీయ పార్టీలు తమ మెడలు వంచి మోడీకి వంత పాడుతుండటం దారుణం. 20వ తేదీ తర్వాత కూడా ఈ పరిస్థితిలో మార్పు ఆశించలేము. పైగా విశాఖ ఉక్కు సమర్థత పెంచడానికి వర్కింగ్ పెట్టుబడి సమకూర్చడం మరింత పటిష్టం చేసి ప్రైవేటు కార్పొరేట్‌కు కట్టబెట్టే కుట్రమాత్రమే.


వివాదాలు హానికరం

విశాఖ ఉక్కు అమ్మకంలో సాంకేతికంగా తెలంగాణ సర్కారు లేదా సింగరేణి వారు పాల్గొనవచ్చునా, నిబంధనల మేరకు అందుకు కేంద్రం అనుమతినిస్తుందా అనేది ఇంకా అస్పష్టమే. అందుకు ఆటంకం కలిగించే నిబంధనలు కొన్ని వున్నాయి. అయితే విశాఖ ఉక్కును కాపాడుకోవడం కోసం ఇరు రాష్ట్రాల ప్రజల బలీయమైన ఆకాంక్షకు బిఆర్ఎస్ ప్రభుత్వం చొరవ తీసుకోవడం ఆహ్వానించదగిందే. ఇలాంటి సమయంలో తెలంగాణ మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యలు వాటిపై ఎ.పి మంత్రుల ప్రతిసవాళ్లు వివాదానికి దారితీయడం దురదృష్టకరం. ఎనిమిదేళ్ల కిందటే విడిపోయి ఇంకా విభజన సమస్యలు కూడా పరిష్కారం గాని రెండు తెలుగు రాష్ట్రాలు పరస్పర వ్యతిరేక భావాలకు ఆస్కారం ఇవ్వడం సరైంది కాదు. బిఆర్ఎస్, వైసిపి లు పార్టీలుగా వాదించుకోవచ్చు గాని సోదర రాష్ట్రాలుగా సవాళ్లు, ప్రతి సవాళ్లతో రెచ్చగొట్టుకోవడం ఉభయులకూ శ్రేయస్కరం కాదు. తమ తమ పథకాలను ఎవరైనా కీర్తించుకోవచ్చు గాని అంతిమ తీర్పరులు ప్రజలే.

రంజాన్ మాసంలో శుభ పరిణామాలు!

అంతర్జాతీయం

ఇరాన్, సిరియా ప్రతినిధులు సౌదీ అరేబియా గడ్డ మీద అడుగు పెట్టటం, అదీ ఒకే రోజున. కొద్ది నెలల క్రితం వరకు ఇది ఊహకే అందని అంశం. ఇది కలా నిజమా అని అనేక మంది ఆశ్చర్యపోతున్నారు. నిజమే చైనా మధ్యవర్తిత్వంలో నెల రోజుల క్రితం ఇరాన్-సౌదీ అరేబియా మధ్య కుదిరిన ఒప్పందం ఊరికే ప్రకటనలకే. ఒక్క అడుగైనా ముందుకు సాగదని, ప్రచారానికే పరిమితం అంటూ పశ్చిమ దేశాల మీడియా శాపనార్థాలు పెట్టింది. దీనికి భిన్నంగా నెల రోజుల్లోగానే ఫలితాలను ఇస్తున్నట్లు కనిపించటం అరబ్బు, పశ్చిమాసియాలో శాంతిని కోరుకొనే వారికి సంతోషం...పుల్లలు పెట్టేవారికి విషాదంగా మారటంలో ఆశ్చర్యం లేదు. అందునా ముస్లింలు ముఖ్యమైనదిగా భావించే రంజాన్ మాసంలో చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు సహజంగానే అమెరికా, దాని తొత్తు ఇజ్రాయెల్ వంటి కొన్ని దేశాలకు రుచించటం లేదు.



> చైనా మధ్యవర్తిత్వంలో నెల రోజుల క్రితం ఇరాన్-సౌదీ అరేబియా మధ్య కుదిరిన ఒప్పందం ఊరికే ప్రకటనలకే. ఒక్క అడుగైనా ముందుకు సాగదని, ప్రచారానికే పరిమితం అంటూ పశ్చిమ దేశాల మీడియా శాపనార్థాలు పెట్టింది. దీనికి భిన్నంగా నెల రోజుల్లోగానే ఫలితాలను ఇస్తున్నట్లు కనిపించటం అరబ్బు, పశ్చిమాసియాలో శాంతిని కోరుకొనే వారికి సంతోషం... పుల్లలు పెట్టేవారికి విషాదంగా మారటంలో ఆశ్చర్యం లేదు.

తమ ప్రతినిధి వర్గం రియాద్ (సౌదీ అరేబియా రాజధాని) గడ్డ మీద అడుగుపెట్టినట్లు బుధవారంనాడు ఇరాన్ ప్రకటించిన కొద్ది గంటల్లోనే ఎర్ర సముద్ర తీర సౌదీ నగరమైన జెడ్డాకు పన్నెండు సంవత్సరాల తరువాత తొలిసారిగా సిరియా విదేశాంగ మంత్రి వచ్చినట్లు సౌదీ ప్రకటించింది. దీర్ఘకాలంగా కొనసాగుతున్న సిరియా, ఎమెన్ సంక్షోభ పరిష్కారానికి దోహదం చేసే పరిణామాలకు ఇది సంకేతంగా భావిస్తున్నారు. సౌదీ-సిరియా మంత్రులు సిరియా సమస్యకు ఒక రాజకీయ పరిష్కారం కనుగొనే దిశగా చర్చలు జరిపారు. ఈ పరిణామం తిరిగి సిరియా అరబ్బు ప్రపంచంలోకి అడుగుపెట్టటంతో పాటు తటస్థ పాత్రను పోషిస్తుందని సౌదీ చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య ఐక్యత, భద్రత, సిరియా భద్రత గురించి చర్చించటంతో పాటు ఇరుదేశాలు దౌత్య సంబంధాలతో పాటు విమాన సర్వీసులను కూడా పునరుద్ధరించాలని నిర్ణయించాయి. వచ్చే నెలలో జరిగే అరబ్ లీగ్ సమావేశానికి సిరియా అధినేత బషర్ అల్ అసాద్ రాకకు వీలు కల్పించేందుకు శుక్రవారం నాడు జెడ్డాలో లీగ్ ప్రతినిధుల సమావేశం జరగనుంది. దాని కంటే ముందే సిరియా మంత్రి సౌదీ వచ్చాడు. రియాద్‌లో ఇరాన్ రాయబార కార్యాలయంతో పాటు జెడ్డాలో కాన్సులేట్ జనరల్ ఏర్పాటు గురించి ఇరాన్ ప్రతినిధి వర్గం చర్చిస్తున్నది. ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీమ్ రైసీ తమ దేశ పర్యటనకు రావాలని సౌదీ ఆహ్వానం పంపింది. ఆలోగా ఇవన్నీ పూర్తవుతాయి.

ఎమెన్ అంతర్యుద్ధంలో ఇరాన్ మద్దతు ఉన్న హైతీ తిరుగుబాటుదార్లను అణచేందుకు గత ఎనిమిది సంవత్సరాలుగా ఇతర దేశాలను కలుపుకొని సౌదీ అరేబియా మిలిటరీ జోక్యం చేసుకుంటున్నది. ఇప్పుడు దానికి కూడా తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. రాజధాని సనాతో సహా అత్యధిక ప్రాంతాలను తమ ఆధీనంలోకి తిరుగుబాటుదార్లు తెచ్చుకున్నారు. సౌదీ రాయబారి సనా వెళ్లి తిరుగుబాటుదార్లతో చర్చలు జరిపి పదవీచ్యుతులైన పాలకులతో ఒక రాజకీయ పరిష్కారం కుదిర్చే పనిలో వున్నారు. ఎనిమిది సంవత్సరాలుగా కొనసాగిస్తున్న మిలిటరీ చర్యలను నిలిపేసి తన ఆర్థిక వ్యవస్థను చక్కబరుచుకోవాలని సౌదీ నిర్ణయించుకుంది.

ఈ పరిణామాల పూర్వరంగంలో అమెరికా ఎత్తుగడలో భాగంగా ఇజ్రాయెల్ గత కొద్ది రోజులుగా సిరియా ఇతర ప్రాంతాల మీద దాడులకు తెగబడుతోంది. సిరియాలో ఫిబ్రవరి ఆరున సంభవించిన భూకంప బాధితులకు ఇరాన్ పంపుతున్న సాయాన్ని మిలిటరీ పరికరాలు, ఆయుధాలు అందచేయటంగా పెద్ద ఎత్తున అసత్య ప్రచారం చేసింది. దీన్ని సాకుగా చూపి ఇజ్రాయెల్ సిరియా లోని అలెప్పో విమానాశ్రయం, అల్‌దాబ్ వైమానిక కేంద్రంపైనా దాడులు చేసింది. పశ్చిమాసియా, అరబ్బు ప్రాంతాల్లో జరుగుతున్న పరిణామాలు అమెరికాకు మింగుడు పడటం లేదు. వివిధ దేశాల్లో ఉన్న ఇజ్రాయెల్ బాధిత పాలస్తీనా హమాస్ వంటి తిరుగుబాటు బృందాలు, శక్తులకు ఇటీవలి కాలంలో ఇరాన్ పెద్ద ఎత్తున అండదండగా ఉంది. సౌదీతో సర్దుబాటు కుదిరినందున రానున్న రోజుల్లో మరి

ంతగా కేంద్రీకరించవచ్చు. దీనికి తోడు చైనా, రష్యా ప్రభావం పెరగటాన్ని అమెరికా సహించటం లేదు. సౌదీ-ఇరాన్ ఒప్పందాన్ని మొక్కుబడిగా మంచిదేగా అని వర్ణించింది. రానున్న రోజుల్లో ఏదో ఒక సాకు చూపి ఇజ్రాయెల్ ద్వారా మరిన్ని దాడులకు తెగబడినా ఆశ్చర్యం లేదు.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

అభిప్రాయం

పెరుగుతున్న జనాభా తగ్గుతున్న జీవన ప్రమాణాలు

కొన్ని దేశాల్లో జనాభా పెరిగింది. కొన్ని దేశాల్లో జన సంఖ్య తగ్గుముఖం పట్టింది. వృద్ధుల సంఖ్య పెరిగి, యువ జనాభా తగ్గడం కూడా ఆందోళన కలిగించే విషయమే. తక్కువ భూభాగం కలిగి ఎక్కువ జనాభాతో బాధపడే దేశాలు అభివృద్ధిని సాధించలేవు. అధిక జనాభాతో బాధపడే దేశాల్లోని ప్రజలకు అన్ని సదుపాయాలూ కల్పించడం కష్టం. ఈ కారణంగానే చాలా దేశాలు వెనకబడే ఉంటున్నాయి.


వాస్తవ పరిస్థితులను ప్రభుత్వాలు, ప్రజలు అర్థం చేసుకోవాలి. జనాభాను తగ్గించుకుని, పేదరికాన్ని పారదోలాలి. లింగ వివక్షతను రూపుమాపి, సమానత్వాన్ని, మానవత్వాన్ని మెరుగుపరచి మానవ హక్కులను కాపాడాలి. 1989లో యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (యు.ఎన్.డి.పి) నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలంటే ప్రభుత్వాల్లో కదలిక రావాలి. 800 కోట్లకు చేరువలోనున్న ప్రపంచ జనాభాకు అన్ని వసతులు సమకూర్చవలసిన బాధ్యత వాటిపై ఎంతైనా ఉంది.

ఇప్పటికే అడవులను, పచ్చని భూములను ధ్వంసం చేసి, పర్యావరణాన్ని నాశనం చేసేశారు. దాని ఫలితాలను ప్రజలు చవిచూస్తున్నారు. సరైన వసతి లేదు. ఆహార భద్రత లేదు. విద్యా వైద్య సదుపాయాలు గగన కుసుమంలా మారాయి. ఆధునిక ప్రపంచంలో చాలా గ్రామాల్లో తాగునీరు లేక వ్యాధుల బారిన పడుతున్నారు. నగరాలన్నీ మురికి కూపాలుగా మారిపోతున్నాయి. కుటుంబ పోషణార్థం బాలలు వెట్టిచాకిరీ వైపు పయనిస్తున్నారు. బాలకార్మిక వ్యవస్థ పురుడు పోసుకోవడానికి ఆర్థిక లేమి కారణమౌతున్నది. విద్యా సౌకర్యాలు లేక, పట్టించుకునే వారు కరువై వీధి బాలలుగా మారే వారి సంఖ్య ప్రస్తుత ఆర్థిక సంక్షోభ నేపథ్యంలో పెరిగే అవకాశముంది.

జనాభా పెరుగుదల వలన కలిగే దుష్పరిణామాలను అవగతం చేసుకున్న ఐక్యరాజ్యసమితి దశాబ్దాల క్రితమే కార్యాచరణ ప్రారంభించింది. పలు ప్రపంచ దేశాలు సైతం చేతనైన ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా, ప్రపంచ ప్రజల, ప్రభుత్వాల ఆలోచనా విధానంలో మార్పు రాకపోతే ఫలితం శూన్యం. కాబట్టి జనాభా పెరుగుదల వలన కలిగే విపత్కర పరిణామాలపై ప్రజల్లో నిరంతర చైతన్యం కలిగించాలి.

చైనా జనాభా కొద్ది దశాబ్దాల్లో గణనీయంగా తగ్గే అవకాశాలున్నాయి. జనాభాలో వృద్ధుల శాతం పెరుగుతుండటంతో చైనా వన్ చైల్డ్ విధానానికి వీడ్కోలు చెప్పింది. ఇద్దరు పిల్లలను కనేందుకు జంటలకు అనుమతి ఇచ్చింది. ఇస్లామిక్ విప్లవం తర్వాత ఇరాన్‌లో జనాభా విస్ఫోటనం జరిగింది. కాని ప్రస్తుతం జనాభా తగ్గుముఖం పడుతున్నది. ఇటలీ జనాభా తరిగిపోయి, వృద్ధులు పెరిగిపోతున్నారు. జపాన్ జనాభాలో సగం మంది వృద్ధులు వుండే అవకాశాలున్నాయి. భారత జనాభా చైనాను అధిగమిస్తుందని ఒక అంచనా. జన విస్ఫోటనం మధ్య మానవాళి ఎదుర్కొంటున్న ఆర్థిక, ఆహార, ఆవాస, తాగునీటి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంలో ప్రపంచమంతా అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్రపంచ దేశాలన్నీ నిర్దిష్టమైన ప్రణాళిక, కార్యాచరణతో సమిష్టితత్వంతో ముందుకు సాగాలి.

- సుంకవల్లి సత్తిరాజు



సూడాన్ రాజధాని ఖార్టూమ్‌లో పహారా కాస్తున్న సైన్యం

పేలుళ్లతో దద్దరిల్లిన ఖార్టూమ్

- ఆర్మీ, పారా మిలటరీ బలగాల మధ్య ఘర్షణలు, కాల్పులు

ఖార్టూమ్ : పేలుళ్లతో సూడాన్ రాజధాని ఖార్టూమ్ శనివారం దద్దరిల్లింది. సాధారణ ఆర్మీ, పారా మిలటరీ బలగాలు ఒకరి స్థావరాలపై మరొకరు దాడులు చేసుకుంటున్నాయి. దేశం చాలా ప్రమాదకరమైన మలుపులో వుందంటూ సైన్యం హెచ్చరించిన కొద్ది రోజులకే ఈ దాడులు చోటు చేసుకున్నాయి. అధ్యక్ష భవనం, ఖార్టూమ్ విమానాశ్రయం తమ అధీనంలో వున్నాయని పారామిలటరీ బలగాలు చెప్పాయి. సైన్యం ఆ వార్తలను ఖండించింది. దేశం పూర్తిగా కుప్పకూలకుండా వుండాలంటే ముందుగా కాల్పుల విరమణ జరగాలని పౌరనేతలు పిలుపునిచ్చారు. మిలటరీ నేత అబ్దుల్ ఫత్తా అల్ బుర్హాన్‌కు, నెంబర్ టూ స్థానంలో వున్న పారా మిలటరీ బలగాల కమాండర్ హమ్‌దాన్ డాగ్లోకు మధ్య వివాదాలు ముదరడంతో ఈ హింస చోటు చేసుకుంది. పారా మిలటరీ అయిన రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఆర్ఎస్ఎఫ్)ను రెగ్యులర్ ఆర్మీలోకి విలీనం చేయాలన్న ప్రతిపాదనపై ఈ ఉద్రిక్తతలు చెలరేగాయి. దక్షిణ ఖార్టూమ్‌లోని ఆర్ఎస్ఎఫ్ స్థావరానికి సమీపంలో ఘర్షణలు, పెద్ద పెద్ద పేలుళ్లు, తుపాకుల కాల్పులు జరిగాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

ఇళ్లలోనే ఉండండి : భారతీయ ఎంబసీ

దేశంలో ఘర్షణలు చెలరేగిన నేపథ్యంలో భారతీయులందరూ బయటకు వెళ్లకుండా ఇళ్లలోనే వుండాల్సిందిగా సూడాన్‌లోని భారతీయ ఎంబసీ ఒక ప్రకటనలో కోరింది.

13 ప్రాంతీయ భాషల్లో సిఎపిఎఫ్ కానిస్టేబుల్ పరీక్ష

- స్టాలిన్ లేఖతో కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ: కేంద్ర సాయుధ పోలీస్ ఫోర్స్ (సిఎపిఎస్) కానిస్టేబుల్ పరీక్షను హిందీ, ఇంగ్లీష్‌తో పాటు 13 ప్రాంతీయ భాషల్లో నిర్వహించడానికి కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. సిఎపిఎఫ్‌లో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్), బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బిఎస్ఎఫ్), సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్), ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (టిబిపి), సశాస్త్ర సీమా బాల్ (ఎస్ఎస్‌బి), నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జి) భాగంగా ఉంటాయి. హిందీ, ఇంగ్లీష్‌లతో పాటు అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, మరాఠీ, మలయాళం, కన్నడ, తమిళం, తెలుగు, ఒడియా, ఉర్దూ, పంజాబీ, మణిపురి, కొంకణి వంటి 13 ప్రాంతీయ భాషల్లో పరీక్షను నిర్వహించనున్నారు. సిబ్బంది రిక్రూట్‌మెంట్ ప్రక్రియకు సంబంధించిన పరీక్షను తమిళ భాషలో నిర్వహించాలని తమిళనాడు సిఎం ఎంకె స్టాలిన్ ఇటీవల కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కోరుతూ లేఖ రాశారు. దీని తర్వాత ఈ ప్రకటన వచ్చింది. హిందీ, ఇంగ్లీష్‌లో పరీక్ష రాయడం వల్ల ఇతర భాషల ఆశావహులు నష్టపోతున్నారని స్టాలిన్ లేఖలో పేర్కొన్నారు. ప్రాంతీయ భాషల్లో పరీక్ష నిర్వహించాలని కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన ట్వీట్ చేశారు.

నదిలో ట్రాక్టర్ బోల్తా

- యుపిలో 12 మందికి పైగా మృతి

లక్నో: ఉత్తర్ ప్రదేశ్ షాజహాన్ పూర్ లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గర్రా నదిలో ప్రయాణికులతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. 42 మందితో అజ్మత్ పూర్ వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీ ఒక్కసారిగా వంతెనపై నుంచి కింద పడింది. తిల్హార్ పోలీస్ స్టేషన్‌లోని బిర్సింగ్‌పూర్ గ్రామ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 12 మందికి పైగా మరణించారు. పలువురు గాయపడ్డారు.

పెన్షన్ బిల్లుపై మాక్రాన్ సంతకాలు

- మే 1న మూకుమ్మడి నిరసనలకు ఫ్రెంచి కార్మిక సంఘాల పిలుపు

పారిస్ : నిరసనలు వెల్లువెత్తుతున్నప్పటికీ వివాదాస్పద పెన్షన్ సంస్కరణల బిల్లుపై అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ శనివారం సంతకాలు చేయడంతో చట్టం అమల్లోకి వచ్చింది. పెన్షన్ సంస్కరణల్లోని కీలకమైన నిబంధనకు 9మంది సభ్యులు గల రాజ్యాంగ మండలి ఆమోద ముద్ర వేసింది. పూర్తి స్థాయి పెన్షన్ కావాలంటే ఇకపై 64 ఏళ్ల వరకు పనిచేయాల్సి వుంటుంది. దీన్ని అన్ని వర్గాల కార్మికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ బిల్లును అమలు చేయవద్దని కోరుతూ గత మూడు మాసాలుగా దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు జరుగుతున్నా, వాటిని పట్టించుకోని రీతిలో మాక్రాన్ వ్యవహరించారు. ఫ్రాన్స్ అధికార జర్నల్‌లో ఈ విషయం తెల్లవారు జామునే ప్రచురితం కావడంతో ఇది చట్టంగా రూపుదిద్దుకుంది. ప్రతిపక్షాలు మాక్రాన్ వ్యవహార శైలిని దుమ్మెత్తిపోశాయి. బిల్లుకు రాజ్యాంగ కౌన్సిల్ శుక్రవారం ఆమోదం తెలిపిన కొద్ది గంటల్లోనే పతాకశీర్షికలో వార్త ప్రచురితమైంది. మే 1వ తేదీన మూకుమ్మడి నిరసనలు తప్పవని కార్మిక సంఘాలు హెచ్చరించాయి. కొన్నిచోట్ల హింసాత్మక ప్రదర్శనలు కూడా చోటుచేసుకున్నాయి. "దొంగల మాదిరిగా అర్థరాత్రి పూట బిల్లును ఆమోదించారు." అని ఫ్రెంచి కమ్యూనిస్టు పార్టీ చీఫ్ ఫాబియన్ రౌసెల్ విమర్శించారు. మే 1వ తేదీన ప్రతి ఒక్కరూ వీధుల్లోనే వుంటారని ప్రకటించారు. ప్రజాస్వామ్యం బందీ అయిందని వామపక్ష ఎంపి ఫ్రాంకోయిస్ రూఫిన్ విమర్శించారు.

‘పుల్వామా’ కేంద్రం అసమర్థతే

- అప్పుడు మా నోరు మూయించారు
- మాలిక్ వ్యాఖ్యలపై రాజకీయ ప్రకంపనలు
- ఎన్నికల లబ్ధి కోసం జవాన్ల ప్రాణాలు ఫణంగా పెట్టారు
- ప్రతిపక్షాల మండిపాటు



సత్యపాల్ మాలిక్, నరేంద్ర మోడీ

పుల్వామాలో ఉగ్రవాద దాడి జరిగిన ప్రాంతం (ఫైల్)

న్యూఢిల్లీ : 2019 ఫిబ్రవరిలో పుల్వామాలో జరిగిన ఉగ్రవాద దాడికి నరేంద్ర మోడీ ప్రభుత్వ అసమర్థత, ఇంటెలిజెన్స్ వైఫల్యమే కారణమంటూ ఓ ఇంటర్వ్యూలో జమ్ముకాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ చేసిన విమర్శలు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. మాలిక్ వ్యాఖ్యలు ఆందోళన కలిగించేవిగా ఉన్నాయని, ప్రభుత్వ అసమర్థతను బయటపెడుతున్నాయని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

మాలిక్ మాటలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ట్విట్టర్‌లో స్పందిస్తూ ‘ప్రధాని అవినీతిని పెద్దగా అసహ్యించుకోరు’ అని ఎద్దేవా చేశారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ కూడా తన అధికారిక ట్విటర్ పేజీలో మాలిక్ విమర్శలను పునరుద్ఘాటించింది. 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు తన వ్యక్తిగత ప్రతిష్టను పెంచుకునేందుకు ప్రధాని మోడీ ఈ ఘటన తీవ్రతను తక్కువ చేసి చూపారని పేర్కొంది. సైనికులకు విమానం పంపి ఉంటే 40 ప్రాణాలు గాలిలో కలిసేవి కావని విమర్శించింది.

మాలిక్ చెప్పినదే నిజమై ఉంటే అంతకంటే దారుణం మరొకటి ఉండబోదని కాంగ్రెస్ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి మనీష్ తివారీ అన్నారు.

‘అత్యున్నత రాజ్యాంగ పదవికి ప్రధాని నరేంద్ర మోడీ ఎంపిక చేసిన వ్యక్తి చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే అవినీతి అనేది బిజెపి ప్రభుత్వ ప్రాధాన్యత కాదని అర్థమవుతోంది’ అని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. పుల్వామా ఘటనలో వాస్తవాలు బయటకు వచ్చాయని ఆర్‌జెడి తెలిపింది. ఈ ఘటన తర్వాత ప్రతిపక్షాలు ఇవే విషయాలను ప్రస్తావిస్తే బిజెపి ప్రభుత్వం వాటి నోరు నొక్కేసిందని శివసేన (థాకరే గ్రూపు) నేత సంజయ్ రౌత్ గుర్తు చేశారు. ‘ఎన్నికలలో గెలవడం కోసమే ఉగ్రవాద దాడులు జరిగాయా? రాజకీయ ప్రయోజనాల కోసమే 40 మందిని పొట్టన పెట్టుకునే కుట్ర చేశారా?’ అని మండిపడ్డారు. సిఆర్‌పిఎఫ్ జవాన్లు విమానం కోసం అడిగితే ఎందుకు ఇవ్వలేదని సమాజ్‌వాదీ పార్టీ ప్రతినిధి మనోజ్ సింగ్ ప్రశ్నించారు. సైనికుల మరణాలకు ఎవరు బాధ్యులని నిలదీశారు. రాష్ట్రపతి భవన్ సందర్శకుల జాబితాను ప్రధాని కార్యాలయం ఆమోదించాల్సి ఉంటుందని మాలిక్ చెబుతున్నారని, అంటే రాష్ట్రపతిని కేవలం ఒక కీలుబొమ్మగా మారుస్తున్నారని కాంగ్రెస్ ప్రతినిధి సాల్మన్ అనీస్ సోజ్ వ్యాఖ్యానించారు.

మాలిక్ ఏం చెప్పారంటే.....

పుల్వామా ఘటనలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వైఫల్యాలపై నోరు విప్పవద్దంటూ ప్రధాని నరేంద్ర మోడీ తనకు చెప్పారని అప్పటి జమ్మూకాశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ తెలిపారు. ‘ప్రభుత్వ అసమర్థత, సిఆర్‌పిఎఫ్, హోం మంత్రిత్వ శాఖ ఉదాశీనత కారణంగానే పుల్వామా దాడి జరిగింది. సైనికులను చేరవేసేందుకు విమానం కావాలని కోరితే హోం శాఖ నిరాకరించింది. దాడి జరిగిన తర్వాత ప్రధాని నాకు ఫోన్ చేశారు. నేను ఈ విషయాలన్నీ ఆయనకు వివరంగా చెప్పాను. మౌనం వహించాలని, ఎవరికీ ఏమీ చెప్పవద్దని ఆయన ఆదేశించారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కూడా ఇదే మాట అన్నారు. పాకిస్తాన్‌పై నెపం మోపి, ఎన్నికలలో లబ్ధి పొందేందుకే ఇలా చేస్తున్నారని నాకు అర్థమైంది. ఈ సంఘటనలో ఇంటెలిజెన్స్ వైఫల్యం కూడా ఉంది. మూడు వందల కిలోల ఆర్‌డిఎక్స్ పేలుడు పదార్థాలను తీసుకొని ఒక కారు పాకిస్తాన్ నుండి వచ్చింది. అయితే అది 10-15 రోజుల పాటు జమ్ముకాశ్మీర్ గ్రామాల గుండా, రోడ్ల మీదుగా ప్రయాణించి వచ్చింది. మధ్యలో దానిని ఎవరూ కనిపెట్టలేకపోయారు. ఇది ఇంటెలిజెన్స్ వైఫల్యమే’ అని మాలిక్ ఆ ఇంటర్వ్యూలో చెప్పారు.

టికెట్ ఇవ్వకపోతే బిజెపికి 20-25 సీట్లు గల్లంతే

- మాజీ సిఎం జగదీశ్ శెట్టర్ హెచ్చరిక

హుబ్బళి : తనకు టికెట్ ఇవ్వకపోతే.. వచ్చే ఎన్నికల్లో బిజెపి కనీసం 20-25 సీట్లను కోల్పోవాల్సి వస్తుందని కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ శెట్టర్ హెచ్చరించారు. బిజెపి ఇప్పటివరకు రెండు విడతల్లో అభ్యర్థుల జాబితాను విడుదల చేయగా.. ఇంకా 12 స్థానాలకు అభ్యర్థులను కేటాయించలేదు. ఇందులో మాజీ సీఎం శెట్టర్ పోటీ చేయాలని భావిస్తున్న హుబ్బళి-ధార్వాడ్ నియోజకవర్గం కూడా ఉంది. ఈ నేపథ్యంలో తనకు టికెట్ కేటాయింపు అంశంపై ఇప్పటికే ఢిల్లీ వెళ్లిన శెట్టర్ బిజెపి జాతీయాధ్యక్షుడు జెపి నడ్డాతో సమావేశమయ్యారు. అయినప్పటికీ పార్టీ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ నేపథ్యంలోనే తాజాగా మీడియాతో మాట్లాడిన ఆయన.. పార్టీ హైకమాండ్‌ను హెచ్చరిస్తూ వ్యాఖ్యలు చేశారు. "నాకు టికెట్ కేటాయింపుపై పార్టీ నిర్ణయం కోసం ఆదివారం వరకు ఎదురుచూస్తా. ఆ తర్వాత భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటా. సీనియర్లకు టికెట్లు నిరాకరించడంపై బిజెపి పునరాలోచించుకోవాలి. ఇది వచ్చే ఎన్నికల్లో బిజెపిపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. నాకు టికెట్ ఇవ్వకపోతే ఉత్తర కర్ణాటకలోని చాలా నియోజకవర్గాలపై ఆ ప్రభావం పడుతుందని మాజీ సీఎం యడియూరప్ప కూడా హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లారు. నాకు టికెట్ ఇవ్వకపోతే.. బిజెపి 20 నుంచి 25 సీట్లు కోల్పోయే అవకాశముంది. రాష్ట్రమంతటా కూడా ఆ ప్రభావం ఉంటుంది" అని శెట్టర్ వ్యాఖ్యానించారు. యువ నాయకులకు అవకాశం ఇచ్చేందుకు.. పోటీ నుంచి వైదొలగాలని పార్టీ హైకమాండ్ తనకు సూచించగా, అంగీకరించలేదని, టికెట్ దక్కకపోతే రెబల్‌గా పోటీ చేస్తానని ఆయన హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల కోసం బిజెపి ఇప్పటికే 212 స్థానాలకు అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. మిగతా 12 స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలు, సీనియర్లను పక్కనబెట్టి కొత్తవారికి అవకాశం ఇవ్వడం పార్టీలో అసమ్మతి రాజేసింది. ఇప్పటికే కీలక నేత లక్ష్మణ్ సవది సహా పలువురు నేతలు పార్టీని వీడిన విషయం తెలిసిందే.



43 మందితో కాంగ్రెస్ మూడో జాబితా

- మాజీ డిప్యూటీ సిఎం సవాడీకి అథానీ టికెట్
- సిద్ధరామయ్యకు రెండో సీటు నిరాకరణ

బెంగళూరు : కర్ణాటక కాంగ్రెస్ 43 మంది అభ్యర్థులతో కూడిన మూడో జాబితాను శనివారం విడుదల చేసింది. బిజెపిపై తిరుగుబాటు చేసి కాంగ్రెస్‌లో చేరిన సీనియర్ నాయకుడు, రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి లక్ష్మణ్ సవాడీకి అథానీ స్థానం నుంచి టికెట్ లభించింది. సవాడీ ఆశించిన విధంగానే కాంగ్రెస్ పార్టీ ఆయనకు ఆ సీటు కేటాయించింది. కోలార్ సీటు ఆశిస్తున్న కర్ణాటక మాజీ సిఎం సిద్ధరామయ్యకు భంగపాటు ఎదురైంది. ఆ స్థానాన్ని అధిష్టానం కొత్తూర్ జి మంజునాథ్‌కు కేటాయించింది. సిద్ధరామయ్యకు ఆయన కుమారుడు ప్రాతినిధ్యం వహించిన వరుణ నియోజకవర్గం టికెట్‌ను తొలిజాబితాలోనే ఖరారు చేసింది. రెండో నియోజకవర్గం కింద కోలార్ స్థానం నుంచి కూడా పోటీ చేయాలని ఆయన భావించారు. ‘ఒక అభ్యర్థికి ఒకే స్థానం’ నిబంధనను పాటిస్తున్న కాంగ్రెస్.. మాజీ సిఎం విషయంలోనూ దాన్నే అనుసరించింది. కేంద్ర మాజీ మంత్రి మార్గరెట్ అల్వా కుమారుడు నివేదిత్ అల్వా కుమటా స్థానం నుంచి, చిక్‌మగళూరులోని ముదిగెరె నుంచి మాజీ మంత్రి మోటమ్మ కుమార్తె జ్యోతి ఝువార్ పోటీ చేస్తారు. కన్నడ నటి, మాజీ మంత్రి ఉమాశ్రీకి తేర్గాల్ నియోజకవర్గం నుంచి టికెట్ నిరాకరించారు. 124 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల చేసిన కాంగ్రెస్ పార్టీ.. 42మంది అభ్యర్థులతో రెండో జాబితా, తాజాగా 43 అభ్యర్థులతో మూడో జాబితాను విడుదల చేసింది. ఇప్పటివరకు మొత్తం 209 మంది అభ్యర్థులను ఎన్నికల బరిలో నిలబెట్టింది. ఇంకా 15 మంది అభ్యర్థుల సీట్లను ఆ పార్టీ ప్రకటించాల్సి ఉంది. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ఇటీవల షెడ్యూల్ విడుదలైన విషయం తెలిసిందే. మొత్తం 224 అసెంబ్లీ స్థానాలకు మే 10న ఎన్నికలు జరగనున్నాయి. అదే నెల 13న ఫలితాలు ప్రకటిస్తారు. 224 అసెంబ్లీ సీట్లున్న కర్ణాటకలో ప్రస్తుతం బిజెపికి 119, కాంగ్రెస్‌కు 75, జెడిఎస్‌కు 28 మంది ఎమ్మెల్యేల బలం ఉన్నది. రెండు సీట్లు ఖాళీగా ఉన్నాయి.

బిజెపిని ఓడించడమే దేశభక్తి

(మొదటి పేజీ తరువాయి)

భారాలు పెంచుతోందని తెలిపారు. కార్పొరేట్ సంస్థలకు గత ఏడు సంవత్సరాల కాలంలో రూ.11 లక్షల కోట్లు మాఫీ చేసిందని గుర్తు చేశారు. ఇదే సమయంలో పేదల ఆదాయాలు గణనీయంగా పడిపోతున్నాయని తెలిపారు. గత ఎనిమిది సంవత్సరాల్లో ఒక్కసారి కూడా కనీస వేతనాల్లో పెరుగుదల లేదని, నిరుద్యోగం రికార్డు స్థాయిలో పెరిగిపోయిందన్నారు. ప్రజల మధ్య మత విద్వేషాగ్నిని రగిల్చే ప్రయత్నాలు ముమ్మరం చేసిందని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి ఈ ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ బహిరంగ సభలో జెడిఎస్ రాష్ట్ర నాయకులు రామకృష్ణారెడ్డి, మహమ్మద్ నూరుల్లా పాల్గొని మద్దతునిచ్చారు. సభ ప్రారంభానికి ముందు మాజీ ఎమ్మెల్యే జివి.శ్రీరామిరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఉమేష్, కర్ణాటక రాష్ట్ర కార్యదర్శి బసవరాజు, కార్యదర్శివర్గ సభ్యులు వరలక్ష్మి, ప్రకాశ్ పాల్గొన్నారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న బాగేపల్లి సిపిఎం అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్

10,753 కోవిడ్ కొత్త కేసులు

- 27 మంది మృతి

న్యూఢిల్లీ : కరోనా కేసులు తగ్గుముఖం పట్టాయి. దేశవ్యాప్తంగా గత 24 గంటల్లో 10,753 కొత్త కరోనా కేసులు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ శనివారం వెల్లడించింది. 27 మంది మరణించారు. శుక్రవారం 11,109 కరోనా కేసులు నమోదవ్వగా.. శనివారానికి 300కి పైగా కేసులు తగ్గాయి. ప్రస్తుతం దేశంలో 53,720 యాక్టివ్ కేసులు ఉన్నట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది. గత 24 గంటల్లో 6,628 మంది కరోనా నుంచి కోలుకున్నారు. రికవరీ రేటు 98.69 శాతంగా ఉంది. రోజువారీ పాజిటివిటీ రేటు 6.68 శాతంగా ఉంది. ఢిల్లీలో ఆరుగురు, మహారాష్ట్ర, కేరళలో నలుగురేసి, రాజస్థాన్‌లో ముగ్గురు, ఛత్తీస్‌గఢ్, హర్యానా, గుజరాత్, మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్ము కాశ్మీర్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఒక్కొక్కరు వైరస్‌కి బలయ్యారు.

కాలుష్య ఉద్గారాల కోతలను పెంచండి

- సంపన్న దేశాలను కోరిన భారత్



న్యూఢిల్లీ : కాలుష్య ఉద్గారాల కోతలను పెంచాలని సంపన్న దేశాలను భారత్ కోరింది. 2050కల్లా కాలుష్య ఉద్గారాలను జీరోకు తీసుకురావాలన్న అంతర్జాతీయ లక్ష్యాన్ని సాధించేందుకు సంపన్న దేశాలు వారి ప్రయత్నాలను మరింత ముమ్మరం చేయాలని భారత్ కోరింది. జపాన్‌లోని సాపోరోలో పరిశుద్ధ ఇంధనం, పర్యావరణంపై జి7 దేశాల మంత్రుల సమావేశంలో భారత్ ఈ వ్యాఖ్యలు చేసింది. దీనివల్ల భారత్ వంటి వర్ధమాన దేశాలకు వారి ప్రజల అవసరాలను తీర్చేందుకు అవకాశాలు ఏర్పడతాయని పేర్కొంది.

వాతావరణ మార్పుల దుష్ప్రభావాలను, పర్యావరణ క్షీణతను, కాలుష్యాన్ని ఎదుర్కొనడానికి అవసరమైన సామర్థ్యాలను నిర్మించుకోవడానికి కూడా అవకాశం వుంటుందని ప్లీనరీ సమావేశంలో భారత పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ పేర్కొన్నారు. వాతావరణ మార్పులను సమర్థవంతంగా ఎదుర్కొనడానికి, పర్యావరణ సవాళ్ళను పరిష్కరించడానికి వర్ధమాన దేశాలు అవసరమైన నిధులు, సాంకేతికతలను సమకూర్చుకోవాల్సి వుందని అన్నారు. సంపన్న దేశాలు తమ కాలుష్య ఉద్గారాల కోతలను మరింత మెరుగుపరుచుకోవడం ద్వారా అంతర్జాతీయ లక్ష్యాన్ని సాధించగలం. దీనివల్ల భారత్ వంటి దేశాలకు వారి ప్రజలకు అవసరమైన అభివృద్ధిని సాధించే అవకాశాలు అందుతాయని అన్నారు. సంపన్న దేశాలు తాము ఇచ్చిన హామీలకు కట్టుబడి వాటిని అమలు చేయగలవని ఆశిస్తున్నట్లు తెలిపారు.

గోధుమల సేకరణ ధర తగ్గింపుపై 18న దేశవ్యాప్త ఆందోళన

- సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గోధుమల సేకరణ ధరను తగ్గించి, రైతులపై మోడీ ప్రభుత్వం దాడికి దిగిందని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) విమర్శించింది. కేంద్రప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఈ నెల 18న దేశవ్యాప్త నిరసనలు చేపట్టాలని శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది. గోధుమల నాణ్యతను సాకుగా చూపి రైతులపై మోడీ ప్రభుత్వం చేసిన తాజా దాడిని అన్ని స్థాయిల్లో ప్రతిఘటిస్తామని పేర్కొంది. వాతావరణ మార్పులు, అకాల వర్షాల కారణంగా ఈ సీజన్‌లో పంటల నాణ్యత దెబ్బతిన్న సంగతి తెలిసిందే. ఈ ప్రకృతి వైపరీత్యానికి రైతులపై జరిమానా విధించడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించింది. కొనుగోలు ధరను క్వింటాల్‌కు రూ.31.87 వరకు తగ్గించిందని తెలిపింది. నాణ్యతను సాకుగా చూపి రైతుల నుంచి గోధుమల సేకరణ ధరను తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించడం రైతులను మోసం చేయడమేనని పేర్కొంది. ఇంతకుముందు, సేకరణను తగ్గించడానికి ప్రభుత్వం పరిమాణంపై సీలింగ్‌లను ఉపయోగించిందని, ఇప్పుడు నాణ్యత సాకుతో కొనుగోళ్లను తగ్గించేందుకు ప్రయత్నిస్తోందని, ఇది పూర్తిగా అన్యాయమని తెలిపింది. ప్రతి పంట గింజను తప్పనిసరిగా కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి కొనుగోలు చేయాలని, నాణ్యత ఆధారంగా కొనుగోళ్లలో ఎలాంటి తగ్గింపును సహించేది లేదని ఎస్‌కెఎం స్పష్టం చేసింది. వాతావరణ మార్పుల కారణంగా నాణ్యత వైవిధ్యాలు రైతుల తప్పు కాదని, ధరల తగ్గింపుపై సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. గతేడాది వలే ఎంఎస్‌పి వద్ద పూర్తి సేకరణ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ నెల 18న దేశవ్యాప్త నిరసన జయప్రదం చేయాలని రైతులకు పిలుపునిచ్చింది.

సైనికుల ప్రాసిక్యూషన్‌కు అనుమతి నిరాకరణ

- 14మంది అమాయకులను పొట్టనబెట్టుకున్న నాగాలాండ్ కాల్పులపై కేంద్రం వైఖరి

న్యూఢిల్లీ : నాగాలాండ్‌లో తీవ్రవాద వ్యతిరేక చర్యలు బెడిసికొట్టి 14మంది యువకుల మరణానికి దారితీసిన ఘటనలో 30మంది సైనికులను ప్రాసిక్యూట్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. 2021 డిసెంబరులో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ సంఘటనలో నిందితులైన 30మందిపై దర్యాప్తు చేపట్టడానికి రక్షణ శాఖ, మిలటరీ వ్యవహారాల విభాగం, భారత ప్రభుత్వం అనుమతిని తిరస్కరించాయని నాగాలాండ్‌లో పోలీసుల ప్రకటనను ఉటంకిస్తూ ఎన్‌డి టివి పేర్కొంది. నాగాలాండ్‌లోని మాన్ జిల్లాలో జరిగిన ఈ కాల్పుల ఘటనపై దర్యాప్తు జరిపిన ప్రత్యేక దర్యాప్తు బృందం దాఖలుచేసిన చార్జిషీట్‌లో భారత సైనికుల పేర్లు నిందితులుగా పేర్కొంది. రక్షణ మంత్రిత్వశాఖ అనుమతి నిరాకరణను స్థానిక కోర్టుకు తెలియజేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కాల్పుల్లో 14మంది పౌరులు, ఒక సైనికుడు మరణించారు. ఈ సంఘటన జరిగిన వెంటనే ఆర్మీ చీఫ్ జనరల్ నరవనె మాట్లాడుతూ, బాధ్యులైన సైనికులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జనవరి అల్లర్లలో బోల్సనారో పాత్రపై విచారణ

- 10రోజుల్లోగా పోలీసు ఎదుట హాజరుకండి : సుప్రీం ఆదేశం

బ్రసీలియా : జనవరి8 నాటి అల్లర్ల కేసులో బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జెయిరో బోల్సనారో పోలీసులు విచారించనున్నారు. 10 రోజుల్లోగా పోలీసుల ఎదుట హాజరుకావాలని బ్రెజిల్ సుప్రీం కోర్టు శుక్రవారం ఆదేశించింది. అధ్యక్ష ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేని బోల్సనారో రాజధాని బ్రసీలియాలో సుప్రీం కోర్టు భభనంపైన, పార్లమెంటు, అధ్యక్ష భవనాలపైన, ఇతర ప్రభుత్వ కార్యాలయాలపైన దాడులు, విధ్వంసానికి తన అనుయాయులను ప్రేరేపించారని పోలీసులు పేర్కొన్నారు. లూలా ప్రభుత్వాన్ని అస్థిరత్వ పాల్జేసేందుకు అమెరికాలోని ఫ్లోరిడా నుంచి బోల్సనారో కుట్ర పన్నారన్న ఆరోపణలు కూడా వినవస్తున్నాయి అందుకే ఈ అల్లర్ల కేసులో బోల్సనారో పాత్రపై ఆయనను ప్రశ్నించాలని నిర్ణయించినట్లు ప్రాసిక్యూటర్ జనరల్ కార్యాలయం తెలిపింది. ఆ మేరకు పిటిషన్ దాఖలు చేయగా, సుప్రీంకోర్టు అందుకు అనుమతించింది. కొత్ల అధ్యక్షుడికి లాంఛనంగా బాధ్యతలు అప్పగించే కార్యక్రమానికి కూడా హాజరు కాకుండా అమెరికాకు ఉడాయించిన బోల్సనారో మూడు మాసాల తరువాత ఇటీవలే బ్రెజిల్‌కి తిరిగివచ్చారు.

బీహార్‌లో కల్తీ మద్యం తాగి 8 మంది మృతి

బీహార్ : మద్యపాన నిషేధం ఉన్న బీహార్‌లో కల్తీ మద్యం తాగి ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయిన విషాద సంఘటన శనివారం చోటు చేసుకుంది. రాష్ట్రంలోని మోతిహారిలో జరిగిన ఈ ఘటనలో మరో 25 మంది ఆసుపత్రి పాలయ్యారు. నితీష్ కుమార్ ప్రభుత్వం 2016 ఏప్రిల్‌లో రాష్ట్రంలో మద్యం అమ్మకాలు, వినియోగంపై సంపూర్ణ నిషేధాన్ని విధించింది. బ్లాక్ మార్కెట్‌లో అమ్ముడవుతున్న కల్తీ మద్యం తాగడం వల్ల ఈ ఈ ఘటన జరిగింది.



సంఘ సంస్కర్త వీరేశలింగం


పిల్లలూ, ఈ రోజు కందుకూరి వీరేశలింగం జయంతి.
ఈ సందర్భంగా ఆయన గురించి కొన్ని విషయాలు తెలుసుకుందామా!



వీరేశలింగం పంతులు 1848 ఏప్రిల్ 16వ తేదీన రాజమండ్రిలో పున్నమ్మ, సుబ్బారాయుడు అనే దంపతులకు జన్మించాడు. ఆయన పూర్వికులు ప్రకాశం జిల్లాలోని కందుకూరు నుంచి వలస వచ్చి రాజమండ్రిలో స్థిరపడ్డారు. వీరేశలింగం నాలుగో ఏట తండ్రి చనిపోయాడు. దాంతో నాయనమ్మ, పెదనాన్న వద్ద పెరిగారు. ఐదేళ్ల వయస్సులో స్కూల్లో చేరాడు. పదమూడేళ్ల వయస్సులో బాపమ్మతో వివాహం జరిగింది. వీరేశలింగం కేశబ్ చంద్ర సేన్ రాసిన పుస్తకాలు చదివి హేతువాద దృష్టి పెంచుకున్నాడు. దయ్యాలు లేవని నిరూపించడానికి చిన్నప్పుడే అర్ధరాత్రి శ్మశానానికి వెళ్లాడు.

చదువు పూర్తయ్యాక ఉపాధ్యాయుడిగా పనిచేశారు. పిల్లలకు చదువుతో పాటు సామాజిక అంశాలు వివరించేవాడు. సమాజంలో జరుగుతున్న దురాగతాలపై తన భావాలను వ్యక్తం చేయటానికి వివేకవర్ధని అనే పత్రికను ప్రారంభించారు. హితకారిణి సమాజాన్ని ప్రారంభించాడు. బాలికా విద్య కోసం, వితంతు పునర్వివాహం కోసం ఎంతో కృషి చేశాడు. చాదస్తులు తీవ్ర వ్యతిరేకత తెలిపినా సుమారు 40 వితంతు వివాహాలు జరిపించాడు. వీరేశలింగానికి తన స్నేహితులు, భార్య రాజ్య లక్ష్మమ్మ ఎల్లప్పుడూ తోడుగా ఉన్నారు.

కందుకూరి వీరేశలింగం సంఘ సంస్కర్త, రచయిత. బాలికల కోసం పాఠశాలు స్థాపించారు. నిమ్న కులాలకు చెందిన పిల్లలను మిగతా పిల్లలతో కూర్చోబెట్టి చదువు చెప్పారు. ఆయనకు గద్య తిక్కన అనే బిరుదు ఉంది. అనేక నాటికలు, నాటకాలు, ప్రహసనాలూ రాశారు. తెలుగులో తొలి నవల 'రాజశేఖర చరిత్ర'ను ఆయన రాశారు. తెలుగులో మొట్ట మొదటి స్వీయ జీవిత చరిత్ర కూడా ఆయనదే! వీరేశలింగం 71వ ఏట 1919 మే 27న మరణించారు. ఆయన జన్మదినాన్ని తెలుగు నాటకరంగ దినోత్సవంగా జరుపుకుంటారు.



లెక్క తేల్చండి

చిన్నారులూ... ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

జవాబు : 62


నేను గీసిన బొమ్మ



- ఎస్. జుబేర్,
6వ తరగతి,
జడ్. పి. ఉన్నతపాఠశాల,
మైదుకూరు, కడప జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



గౌరవప్రదమైన జీవితమన్న నెపంతో అనాదిగా ఆమె ఎన్నో దురాచారాలకు బలౌతూనే ఉంది. బాల్య వివాహాలు, సతీసహగమనం, వితంతు ఆచారాలు వంటివి ఎన్నింటినో ఎదుర్కొని ధీరవనితగా ముందుకు అడుగులు వేస్తున్నా.. నేటికీ ఎక్కడో ఒకచోట ఆ ఆనవాళ్లకు బలిపశువుగానే మిగిలిపోతోంది. తాజాగా రాజస్థాన్‌లో వెలుగుచూసిన ఓ ఆచారం ఆమెను తలవంపులకు గురిచేస్తోంది. వితంతు పునర్వివాహమనే విధానాన్ని అత్యంత హేయంగా అమలు చేస్తున్నారక్కడ. భర్త చనిపోయిన స్త్రీ తనకు ఇష్టం ఉన్నా లేకపోయినా అతని సోదరుడితో రెండో వైవాహిక బంధం కొనసాగించాల్సిందే.. అతనికి పెళ్లయి పిల్లలున్నా మరో భార్యగా చలామణి అవ్వాల్సిందే.. తరతరాలుగా ఈ అమానవీయ ఆచారం అక్కడ అమలౌతోంది.

ఆచారం పేరుతో అవమానం!

ఫిబ్రవరి 28 నుండి పది రోజుల పాటు జైపూర్ షాహిద్ స్మారక్ వద్ద సుందరీ గుర్జార్, మంజూ జాట్ నిరసన చేశారు. పుల్వామా దాడిలో ప్రాణాలు కోల్పోయిన జవాను భార్యలు వారు. తమ భర్తలు చేసిన త్యాగానికి గుర్తుగా వారి విగ్రహాలు స్థాపించాలని, అలాగే భర్తల ఉద్యోగం అతని తమ్ముడికో.. అన్నకో.. ఇవ్వాలన్నది వారి ప్రతిపాదన. అయితే 11వ రోజున పోలీసులు అక్కడికి చేరుకుని వారి నిరసనను నిలిపేశారు. భర్తల విగ్రహాల మాట అలా వుంచితే ఆ భర్తల సోదరులకు ఉద్యోగం ఇవ్వాలని నిరసన చేయడమేంటని వారికి అనుమానం వచ్చింది. అప్పుడే ఆ భర్తల సోదరులు ఈ జవాను భార్యలకు బంధువులు మాత్రమే కాదని, వారి జీవితంలో రెండో వైవాహిక బంధాన్ని కలిగివున్నారని తెలిసింది. ఈ విషయమే ఆ జవాను భార్యలను మరింత అవమానాలకు గురిచేసింది. పోలీసులు వారిని నానా దుర్భాషలాడుతూ విపరీతంగా కొట్టి ఊరి శివార్లలోని హాస్పటల్‌లో పడేశారు. ఆ సంఘటన జరిగి ఇన్ని వారాలవుతున్నా ఇప్పటికీ ఆ గాయాలు మానలేదని మంజూ వాపోతోంది. అయితే ఆమె మాటలను బట్టి కనిపిస్తున్న ఆ గాయం కంటే ఆమె మనసుకు తగిలిన గాయం మానడానికి చాలా సమయమే పట్టేట్లు ఉంది.


తలవంపుల 'చురా ప్రాథా'..

'చురా ప్రాథా' లేక 'నాటా' పేరుతో అనాదిగా అమలౌతున్న సాంఘిక దురాచారానికి ఆ మహిళలు బలయ్యారు. భర్త చనిపోయిన తరువాత అతని సోదరుడిని వారి వైవాహిక బంధంలోకి తప్పనిసరిగా ఆహ్వానించారు. అతని పేరు లిఖించబడి వున్న చేతి కంకణాన్ని ధరించారు. 'సెటిల్‌మెంట్' పేరుతో కొంతమంది వ్యక్తుల సమక్షంలో జరిగిన ఒప్పందం ప్రకారం ఇక నుండి ఆమె తన భర్త స్థానంలో వచ్చిన అతన్ని దేవరగా పూజించాలి. అయితే ఆ ఒప్పందంలో తనతో తీసుకొచ్చిన డబ్బు, భూమి, పరిహారాన్ని బట్టి ఆమెకు గౌరవం స్థాయిలు నిర్ణయిస్తారు. వితంతువుకు మొదటి భర్త వల్ల కలిగిన బిడ్డలు, రెండో భర్తకు అతని భార్య వల్ల కలిగిన సంతానం, వితంతువుతో కలిగిన సంతానం వెరసి మూడు బంధాల్లో ఆ కుటుంబాల్లో పిల్లలుంటున్నారు.

ఈ హేయమైన ఆచారం రాజస్థాన్ గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని తరగతుల కుటుంబాల్లో కనిపిస్తోంది. ఈ దురాచారానికి గురైన మహిళ కొన్నిసార్లు కుటుంబం నుండి దూరం కావాల్సి రావడం కూడా అక్కడ చూస్తాం.

నిందలు, అవమానాలతో..







'వీర నారీ', 'యుద్ధ వితంతువులు', 'వీరాంగనలు' అంటూ వేనోళ్ల కీర్తించే ఈ యుద్ధ వీరుల భార్యలు ఇటువంటి దురాచారానికి బలై అవమానాలు, నిందలతో కుటుంబాలకు దూరంగా బతుకుతున్నారు. గోవింద్‌పూర్ బస్రాకు చెందిన మంజూ 2017లో కేంద్ర రిజర్వ్ పోలీస్ ఫోర్స్ ఉద్యోగి అయిన రోహితాష్ లంబాను వివాహం చేసుకుంది. అతని తమ్ముడు జితేంద్ర లంబాకు ఆమె సోదరి హన్సాని ఇచ్చి పెళ్లిచేశారు. ఇది జరిగిన రెండేళ్లకు రోహితాష్ పుల్వామా దాడిలో మరణించాడు. అప్పటికి మంజూ ఒక బిడ్డను కలిగివుంది. ఆమె జీవితంలో జరిగిన ఈ దుర్ఘటనతో గ్రామప్రజలు, బంధువులు, అధికారులు మొదట ఎంతో ఆదరించారు. అయితే ఆమె మిగిలిన జీవితం సుఖంగా సాగాలంటే ఈ ఆదరణ సరిపోదు. అందుకే ఆమెపై ఈ ఆచారాన్ని జరిపించారు పెద్దలు. అలా హన్సా మొదటి బిడ్డను కనేందుకు హాస్పటల్‌కు వెళ్లినప్పుడు 'సెటిల్‌మెంట్'లో మంజూను జితేందర్‌కు మరో భార్యగా నిర్ణయించారు. ఈ పరిణామాన్ని హన్సా అంగీకరించలేకపోయింది. ఈ పరిస్థితి ఆ కుటుంబంలో అనేక మనస్పర్థలకు దారితీసింది. ఫలితంగా కుటుంబం రెండు ముక్కలైంది. మంజూ ఊరి శివార్లలో కాపురం పెట్టాల్సివచ్చింది. ఓ ఆచారం తెచ్చిన విపరీత పరిణామాలకు ముగ్గురు అనుభవిస్తున్న నరకయాతనకు ఇది ప్రత్యక్ష ఉదాహరణ.

ఈ గ్రామానికి 250 కిలోమీటర్ల దూరంలోని సుందర్‌వల్లిలో 25 ఏళ్ల సుందరి నలుగురు పిల్లలను సాకుతోంది. వారిలో ఇద్దరు పిల్లలు పుల్వామా దాడిలో మరణించిన తన మాజీ భర్త జీత్ రామ్ గుర్జార్ సంతానం. మరో ఇద్దరు అతని సోదరుడి వల్ల కలిగారు. 20 ఏళ్ల విక్రమ్ సైన్యంలో చేరాలని కలలు కనేవాడు. ఈలోపే అతని అన్న మరణంతో తనకంటే పెద్దది, ఇద్దరు బిడ్డల తల్లైన అన్న భార్య సుందరితో 'సెటిల్‌మెంట్' జరిగింది. 'నేను ఎన్నో కలలుగన్నాను. కాని ఈ ఆచారం వల్ల వాటన్నింటినీ వదులుకున్నాను. ఇలా చేస్తేనే మా కుటుంబాలు సంతోషంగా ఉంటాయని చెబుతారు. అందుకే ఇష్టం ఉన్నా లేకపోయినా తప్పదు' అంటున్నాడు విక్రమ్.

రక్షణ.. గౌరవం..పేరుతో

గతంలో యుద్ధంలోనే కాదు.. ఏదేని కారణంతో భర్త చనిపోయిన స్త్రీని మరో వివాహం చేసుకునేందుకు ఇక్కడ అనుమతించేవారు కాదు. క్రమంగా ఆ మహిళలు ఇంటి నుండి, బయటి నుండి లైంగిక వేధింపులు ఎదుర్కొనేవారు. దీంతో 'సమాజం నుండి రక్షణ కల్పించేందుకు గౌరవంగా జీవించేందుకే' నంటూ కొన్ని దశాబ్దాలుగా 'చురా ప్రాథా' పేరుతో ఈ ఆచారం చేస్తున్నారు. అయితే జవాను భార్యల విషయానికొచ్చేసరికి 'సెటిల్‌మెంట్'లో భూమి, మగ సంతానం, ఆస్తి, నగదు ప్రయోజనాలు వంటివి చేరాయి.


మరో అవకాశం లేదు..

'నాకు 70 సంవత్సరాలు.. పెళ్లయిన కొన్ని రోజులకే రోడ్డు ప్రమాదంలో భర్త చనిపోయాడు. అతని సోదరుడిని పెళ్లి చేసుకోమన్నారు. ఇప్పుడు నాకు ముగ్గురు బిడ్డలు. ఈ జీవితం నేను కోరుకున్నది కాదు.. నాకు ఇంకో అవకాశం లేదు' అంటూ తన అనుభవాన్ని చెబుతోంది సావిత్రి అనే వృద్ధురాలు. నా తరువాత నేను ఎంతోమంది ఆడవాళ్లు ఈ ఆచారానికి బలవ్వడం చూశాను. అతను వ్యసనపరుడు, జూదరి, సోమరిపోతు అయినా సరే 'సెటిల్‌మెంట్' అయిన తరువాత అతనితో ఉండాల్సిందే.. అంటోంది ఆమె.

మన దేశంలో యుద్ధ వితంతువులు ఎక్కువగా ఉన్న మొదటి ఐదు రాష్ట్రాల్లో రాజస్తాన్ ఒకటి. వెయ్యి మందికి పైగా ఈ రాష్ట్రంలో ఉన్నారు. పుల్వామా వితంతువులే కాదు కార్గిల్ యుద్ధ వితంతువులు కూడా ఇక్కడ ఇటువంటి ఆచారానికే గురయ్యారు. పెద్ద మొత్తంలో నష్టపరిహారం, పెట్రోల్ పంపులు, భూమి వంటి ఆస్తులు సంక్రమించిన జవాను భార్యలను ఆచారం పేరుతో బలవంతంగా 'సెటిల్‌మెంట్'కు బలిచేయడాన్ని చాలామంది నిరసిస్తున్నారు.

నీరూ యాదవ్ చొరవ..

ఈ ప్రాంతానికి మొదటిసారి సర్పంచ్ అయిన నీరూ యాదవ్‌దీ అదే కథ. కార్గిల్ వీర నారిగా అధిక మొత్తం పరిహారం అందుకున్న ఆమె 'సెటిల్‌మెంట్'లో తన భర్త సోదరుడితో జీవించాల్సి వచ్చింది. అయితే పరిహారం సొమ్ము అయిపోగానే అతడు ఆమెను వదిలి వేరే జీవితం చూసుకున్నాడు. ఇటువంటి కథలు అక్కడ ఎన్నో కనబడతాయి. ఇంతటి వేదనా భరిత జీవితాన్ని అనుభవించిన ఆమె సమాజంలో చైతన్యం తేవాలని కంకణం కట్టుకున్నారు. ముందుగా తమపై జరుగుతున్న అనాచారాన్ని ఆ మహిళలు గుర్తించేలా ఏదైనా చేయాలనుకున్నారు. షార్ట్ ఫిల్మ్ దర్శకుడు అరవింద్ తోడ్పాటుతో ఈ దురాచారంపై ఓ షార్ట్ ఫిల్మ్ రూపొందించారు. అయితే దాన్ని చూసేందుకు ఎవరు ముందుకు వస్తారు.. అసలు వస్తారా.. లేదా అన్న అనుమానంతోనే ప్రదర్శన ఏర్పాటు చేశారు. కాని ఊహించనంత మంది వందమందికి పైగా అక్కడికి వచ్చారు. 'ఈ చిత్రం ఇక్కడి మహిళల్లో చర్చకు దారితీసింది. వారి హక్కుల గురించి తెలుసుకునేలా చేసింది. ఇందులో వారి జీవితాలను చూసుకున్నారు. ఆ ఆచారం చెడ్డదని వారంతా ముక్త కంఠంతో చెబుతుంటే ఎంతో సంతోషమేసింది. ఈ షార్ట్ ఫిల్మ్ మార్పుకు బీజం వేసింది. ఇది ఇక్కడితో ఆగిపోకూడదు' అంటోంది నీరూ..




'దరువేయ్ రా'

గోపీచంద్ నటిస్తున్న తాజా చిత్రం 'రామబాణం' నుండి రెండో పాట విడుదలైంది. 'దరువేయ్ రా' అంటూ సాగిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. మిక్కీ జె మేయర్ సంగీతం సమకూర్చగా, కృష్ణ తేజస్వి-చైత్ర ఆలపించారు. శ్రీవాస్ దర్శకత్వంలో పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ ప్రొడ్యూస్ చేస్తున్న ఈ సినిమాలో గోపీచంద్‌కి అన్నగా జగపతి బాబు నటిస్తున్నారు. డింపుల్ హయతి కథనాయికగా నటిస్తున్నారు. మే 5న ఈ సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది.

'ఓజీ' షూటింగ్ ప్రారంభం



పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతోన్న చిత్రం 'ఓజీ'. సుజిత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ గ్యాంగ్ స్టర్ పాత్రలో నటిస్తున్నారు. ముంబైలో షూటింగ్‌ను మొదలు పెట్టనున్నట్లు కొన్ని రోజుల నుంచి ప్రచారం జరుగుతోంది. అయితే చిత్ర యూనిట్ దీనిపై ఓ ప్రకటన చేసింది. ఓజీ మూవీ నుంచి ఫైర్ స్ట్రోమ్ పేరుతో షూటింగ్ మొదలైనట్లు వీడియో ద్వారా ప్రకటించింది. ఇక దర్శకుడు సుజీత్ ఈ సినిమా స్క్రిప్ట్ కోసం ఎంత కృషి చేశాడన్న విషయాన్ని వీడియోలో వైవిధ్యంగా చూపించారు.




'సైంధవ్' మనోజ్ఞ

వెంకటేష్ నటిస్తున్న తాజా సినిమా 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకత్వంలో నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై వెంకట్ బోయనపల్లి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో తొలి షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న ఈ చిత్రం.. ప్రస్తుతం వైజాగ్‌లో చిత్రీకరణ జరుపుకుంటోంది. తాజాగా ఈ చిత్ర హీరోయిన్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో శ్రద్ధా శ్రీనాథ్ కథానాయికగా నటిస్తున్నారు. 'సైంధవ్'లో మనోజ్ఞగా ఆమె నటిస్తుందని తెలుపుతూ.. శ్రద్ధా శ్రీనాథ్ లుక్‌ని పరిచయం చేశారు. వెంకటేష్ కెరీర్‌లోనే భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ ఈ చిత్రంతో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. ఇతర నటీనటులను త్వరలో విడుదల చేయనున్నారు. ఈ సినిమాని దక్షిణాది భాషలతో పాటు హిందీలో డిసెంబర్ 22న క్రిస్మస్ కానుకగా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

మూడు భాషల్లో మ్యూజిక్ వీడియో..



అభయ్ ప్రొడక్షన్స్ పతాకంపై ధనుంజయ్ నటించి, నిర్మించిన 'ఊహలో తేలాల' మ్యూజిక్ వీడియో మూడు భాషల్లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సంగీత దర్శకులు కోటి, ప్రముఖ సంగీత దర్శకులు ఆర్పీ పట్నాయక్, సినీ రచయిత లక్ష్మీ భూపాల తదితరులు పాల్గొన్నారు. తెలుగుతో పాటు తమిళ, హిందీ భాషల్లోనూ రూపుదిద్దుకున్న ఈ మ్యూజిక్ ఆల్బమ్‌ను కోటి, ఆర్పీ పట్నాయక్ కలిసి విడుదల చేశారు. ధనుంజయ్ ఈ మ్యూజిక్ ఆల్బమ్‌లో చక్కని నటన కనబరిచాడని, రాబోయే రోజుల్లో అతను మరింత ఉన్నతమైన స్థితికి చేరుకుంటాడనే నమ్మకం ఉందని వక్తలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఆల్బమ్‌కు వంశీకాంత్ సంగీతం సమకూర్చగా, ఎస్.ఎస్. వీరు రచన చేశారు. యోగిరెడ్డి సినిమాటోగ్రఫీని, ఈశ్వర్ పెంటి కొరియోగ్రఫీని అందించారు.



నాని కొత్త చిత్రం అప్‌డేట్

నేచురల్ స్టార్ నాని 30వ చిత్రం శౌర్యువ్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటోంది. మోహన్ చెరుకూరి డా. విజయేందర్ రెడ్డి తీగల, మూర్తి కె.ఎస్. దీన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి పోస్టర్ ఒకటి నాని విడుదల చేశారు.

మృణాల్ ఠాకూర్ ఇందులో హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ పోస్టర్‌లో డిసెంబర్ 22న సినిమా విడుదల అవుతుందని ప్రకటించారు మేకర్స్. తండ్రీ కూతుళ్ల సెంటిమెంట్ మూవీగా కనిపిస్తోంది. క్రిస్మస్ కానుకగా రాబోతుంది.

మళ్లీ మెరిసిన కోహ్లి

ఐపిఎల్‌లో 47వ అర్ధశతకం ● ఢిల్లీ క్యాపిటల్స్‌పై 23పరుగుల తేడాతో బెంగళూరు గెలుపు



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్
విరాట్ కోహ్లి

బెంగళూరు: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్)లో కింగ్స్ కోహ్లి మరోసారి జూలు విదిలించాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో శనివారం చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో మాజీ కెప్టెన్ కేవలం 34బంతుల్లో 6ఫోర్లు, సిక్సర్ సాయంతో ఐపిఎల్‌లో 47వ అర్ధశతకాన్ని పూర్తి చేశాడు. లామ్రోర్, మ్యాక్స్‌వెల్ కూడా రాణించడంతో బెంగళూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 174పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత ఓవర్లు పూర్తయ్యే సరికి 9వికెట్లు కోల్పోయి 151పరుగులే చేసి ఓటమిపాలైంది. దీంతో బెంగళూరు జట్టు 23పరుగు తేడాతో గెలిచి సీజన్-16లో రెండో విజయాన్ని నమోదు చేసుకుంది. ఇక విరాట్ కోహ్లి ఆల్‌రౌండ్ ప్రదర్శనతోనూ అదరగొట్టాడు. అర్ధ శతకం చేయడంతోపాటు మూడు క్యాచ్‌లను అందుకొని బెంగళూరు గెలుపులో కీలకపాత్ర పోషించాడు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీకి రెండో ఓవర్‌లోనే పెద్ద షాక్ తగిలింది. ప్రధాన బ్యాటర్లు ముగ్గురికి ముగ్గురు డకౌటయ్యారు. పృథ్వీ షా(0), మిచెల్ మార్ష్(0) యశ్ ధూల్(0) ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరారు. కెప్టెన్ డేవిడ్ వార్నర్(19)ను విజయ్‌కుమార్ వ్యాషక్ ఔట్ చేశాడు. దాంతో, 30 పరుగులకే నాలుగు వికెట్లు పడ్డాయి. అభిషేక్ పొరెల్(5), అక్షర్ పటేల్(21)తో కలిసి 40 పరుగులు జోడించాడు. ఆర్సీబీ బౌలర్లలో విజయ్ కుమార్ మూడు, సిరాజ్ రెండు వికెట్లు తీశారు. హర్షల్ పటేల్, పార్నెల్‌కు ఒక్కో వికెట్ దక్కింది.

తొలుత రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ(50) అర్ధశతకంతో మెరిసాడు. డూప్లెసిస్(22), మ్యాక్స్‌వెల్(24) కాసేపు అలరించిన తక్కువకే ఔటయ్యారు. అర్ధసెంచరీ పూర్తయిన వెంటనే లలిత్ యాదవ్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. హర్షల్ పటేల్(6) ప్రయోగం ఫలించకపోగా.. మ్యాక్స్‌వెల్, దినేశ్ కార్తిక్(0) వరుస బంతుల్లో ఔటయ్యారు. ఆఖర్లో అనుజ్ రావత్(15), షాబాజ్ అహ్మద్(20) ధాటిగా ఆడారు. ఢిల్లీ బౌలర్లలో కుల్దీప్ యాదవ్, మిచెల్ మార్ష్ రెండేసి వికెట్లు తీశారు. అక్షర్ పటేల్, లలిత్ యాదవ్‌లకు ఒక్కో వికెట్ దక్కింది.

స్కోర్‌బోర్డు...

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి)యశ్ ధుల్ (బి)లలిత్ యాదవ్ 50, డుప్లెసిస్ (సి)హకీమ్ ఖాన్ (బి)మిచెల్ మార్ష్ 22, లెమ్రోర్ (సి)అభిషేక్ పోరెల్ (బి)మిచెల్ మార్ష్ 26, మ్యాక్స్‌వెల్ (సి)వార్నర్ (బి)కుల్దీప్ 24, హర్షల్ పటేల్ (సి)అభిషేక్ పోరెల్ (బి)అక్షర్ 6, షాబాజ్ అహ్మద్ (నాటౌట్) 26, దినేశ్ కార్తీక్ (సి)లలిత్ యాదవ్ (బి)కుల్దీప్ యాదవ్ 0, అనుజ్ రావత్ (నాటౌట్) 15, అదనం 11. (20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 174పరుగులు. **వికెట్ల పతనం:** 1/42, 2/89, 3/117, 4/132, 5/132, 6/132 **బౌలింగ్:** నోర్జే 4-0-31-0, అక్షర్ 3-0-25-1, ముస్తఫిజుర్ 3-0-41-0, మిచెల్ మార్ష్ 2-0-18-2, లలిత్ యాదవ్ 4-0-29-1, కుల్దీప్ యాదవ్ 4-1-23-2.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: వార్నర్ (సి)కోహ్లి (బి)వ్యాషక్ 19, పృథ్వీ షా (రనౌట్) అనుజ్ రావత్ 0, మిచెల్ మార్ష్ (సి)కోహ్లి (బి)పార్నెల్ 0, యశ్ ధుల్ (ఎల్‌బి)సిరాజ్ 1, మనీష్ పాండే (ఎల్‌బి)హసరంగ 50, అభిషేక్ పోరెల్ (సి)పార్నెల్ (బి)హర్షల్ పటేల్ 5, అక్షర్ పటేల్ (సి)సిరాజ్ (బి)వ్యాషక్ 21, (సి)కోహ్లి (బి)సిరాజ్ 18, లలిత్ యాదవ్ (సి)మ్యాక్స్‌వెల్ (బి)వ్యాషక్ 4, నోర్జే (నాటౌట్) 23, కుల్దీప్ యాదవ్ (నాటౌట్) 7, అదనం 3. (20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 151పరుగులు. **వికెట్ల పతనం:** 1/1, 2/1, 3/2, 4/30, 5/53, 6/80, 7/98, 8/110, 9/128 **బౌలింగ్:** సిరాజ్ 4-0-23-2, పార్నెల్ 4-0-28-1, వ్యాషక్ 4-0-20-3, షాబాజ్ 1-0-11-0, హసరంగ 3-0-37-1, హర్షల్ పటేల్ 4-0-32-1.

శివాలెత్తిన షారుక్

లక్నోపై రెండు వికెట్ల తేడాతో పంజాబ్ విజయం


లక్నో: లక్నో వేదికలో జరిగిన మరో మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ జట్టు రెండు వికెట్ల తేడాతో లక్నోపై విజయం సాధించింది. లక్నో నిర్దేశించిన 160పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో పంజాబ్ జట్టు చివరి ఓవర్‌లో గెలిచింది. తొలుత లక్నో కెప్టెన్ కెఎల్ రాహుల్(74) అర్ధ సెంచరీతో రాణించగా.. మయర్స్(29) ఫర్వాలేదనిపించాడు. వీరిద్దరు మినహా మిగతా బ్యాటర్స్ రాణించలేదు. కృనాల్ పాండ్యా(18), స్టోయినిస్(15) ఆ తర్వాత రెండంకెల స్కోర్ చేశారు. దీంతో లక్నో జట్టు 20 ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. శ్యామ్ కర్రన్‌కు మూడు, రబడాకు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో పంజాబ్‌కు శుభారంభం దక్కలేదు. మిడిలార్డర్ బ్యాటర్స్ షార్ట్(34), భాటియా(22)కి తోడు సికిందర్ రాజా(57) అర్ధసెంచరీతో మెరిసాడు. చివర్లో షారుక్(23నాటౌట్; 10బంతుల్లో ఫోర్, 2సిక్సర్లు) బ్యాట్ ఝుళిపించి మ్యాచ్‌ను ముగించాడు. దీంతో ఈ సీజన్‌లో పంజాబ్ జట్టు మూడో విజయాన్ని సొంతం చేసుకొని పాయింట్ల పట్టికలో నాల్గో స్థానానికి చేరింది.

పాయింట్ల పట్టిక

ఫ్రాంచైజీ	మ్యా	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	4	3	1	6	+1.58
లక్నో	5	3	2	6	+0.76
గుజరాత్	4	3	1	6	+0.34
పంజాబ్	5	3	2	6	-0.06
కోల్‌కతా	3	2	1	4	+1.37
చెన్నై	4	2	2	4	+0.22
బెంగళూరు	4	2	2	4	-0.31
ముంబయి	3	1	2	2	-0.87
హైదరాబాద్	3	1	2	2	-1.50
ఢిల్లీ	5	0	5	0	-1.48

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర: నెట్‌రన్‌రేట్

ఐపిఎల్‌లో నేడు..



ముంబయి × కోల్‌కతా
(వేదిక: ముంబయి, మ.3.30గం॥లకు)
గుజరాత్ × రాజస్తాన్
(వేదిక: అహ్మదాబాద్, రా.7.30గం॥లకు)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68